# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :235 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 23-11-2024 | పేజీలు:4 వెల: 2.00


## అమెరికాలో హైదరాబాద్ విద్యార్థి మృతి

హైదరాబాద్: పుట్టినరోజు వేడుకల్లో ప్రమాదవశాత్తు తుపాకీ పేలి అమెరికాలో హైదరాబాదీ విద్యార్థి ఒకరు. ఈ నెల 13న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భువనగిరికి చెందిన పాల్వాయి సుదర్శన్ రెడ్డి, గీత దంపతులు హైదరాబాద్ ఉప్పల్‌లోని ధర్మపురీ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు పాల్వాయి ఆర్యన్ రెడ్డి (ఆర్యన్ రెడ్డి) ఉన్నత చదువుల కోసం డిసెంబర్‌లో అమెరికా వెళ్లారు. జార్జియాలోని అట్లాంటాలో ఉన్న కెన్నెసా స్టేట్ యూనివర్సిటీలో ఎంఎస్ సెకండియర్ చదువుతున్నారు. ఈక్రమంలో ఈ నెల 13న తన పుట్టిన రోజు కావడంతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. అయితే ఆర్యన్ ఉన్న గది నుంచి తుపాకీ శబ్దం రావడంతో.. స్నేహితులు వెళ్లి చూడగా అతడు అప్పటికే విగతజీవిగా పడి ఉన్నాడు. బుల్లెట్ ఛాతీ లోపలికి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే కనిపించారు. కాగా, తుపాకీని శుభ్రం చేయడం మిస్‌ఫైర్ అయి మరణించినట్లు అధికారులు తెలిపారు. అతడు ఈ ఏడాది ఆగస్టులో హ్యాంటింగ్ గన్‌కు లైసెన్స్ తీసుకున్నారని వెల్లడించారు.

## ప్రతి పక్షాలపై రేణుకా చౌదరి హాట్ కామెంట్స్



హైదరాబాద్,ఏనుగులు పోతుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయి.. పట్టించుకోవాల్సిన అవసరం లేదని ప్రతి పక్షాలపై రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి హాట్ కామెంట్ చేశారు. ఖమ్మం జిల్లాలో రెండు రోజులపాటు హరీష్ రావు పర్యటన నేపథ్యంలో రేణుకా చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి వరకు కుక్కిన పేనులా ఉన్న అజయ్ నేడు మీసాలు తిప్పుతున్నాడని అన్నారు. రైతులకు భేడీలు వేసిన వాళ్ళు ఇవ్వాళ మాట్లాడుతున్నారని తెలిపారు. దుష్టశక్తులు ఏవో మాట్లాడుతున్నారని అన్నారు. కార్తీక మాసంలో అపశకుణం మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ కు రబీకు తేడా తెలియని వారు మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించారు. పోలీసులు లేకుండా జనాల్లోకి వచ్చినా మొహాలామీవి అని కీలక వ్యాఖ్యలు చేశారు. గుట్టలు మాయం చేసిన మీరా మాట్లాడేది అంటూ మండిపడ్డారు. కోయిన్ని వెంకన్నను అడిగితే మీ పాపాలు బయట పడతాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మీకు ప్రజల మీద సానుభూతి ఉంటే సలహాలు సూచనలు చేయండి. స్వీకరిస్తాం అన్నారు. రాష్ట్రం లో ఒక మాట దేశంలో ఒక మాట అంటూ మండిపడ్డారు. బిడ్డను జైల్ నుంచి విడిపించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేశారో దేశ ప్రజలకు తెలుసని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రజలు చాలా హ్యాపీగా ఉన్నారన్నారు. రేవంత్ పాలన భేష్ అన్నారు. బీఆర్ఎస్ వాళ్లకు ఈర్ష్యా ద్వేషాలు పెరిగిపోయాయని తెలిపారు. ఇవాళ హరీష్ రావు పర్యటననే ఓ జోక్ అన్నారు. నాగలి పట్టి దున్నిన మొహలా మీవి అన్నారు. మీ బ్రతుకులు కమిషన్ కాకతీయ, కమిషన్ భగీరథ అని తెలిపారు. మీరు మంచి చేస్తే ఎందుకు ఓడిపోయారన్నారు. బీడీలు వేసిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. ప్రజలను నానా హింసలు పెట్టింది మీరే అని మండిపడ్డారు. ఓడిపోయి ఏమి చేయాలో తెలియక ఇలాంటి జోకులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిద్ర హారాలు మని రేవంత్ పని చేస్తున్నారని తెలిపారు. మీకు ఆత్మగౌరవం ఉందా? అని మండిపడ్డారు. మీకు రాష్ట్ర ప్రయోజనాల మీద కమిట్మెంట్ ఉందా అన్నారు. మీ రాజ్యసభ సభ్యులు ఏ స్కీం తెచ్చారన్నారు. పువ్వాడ అజయ్ కు ఏమీ కనబడవు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే నాతో రా%ౌ%. కలిసి నడుద్దాం అన్నారు. నేను తిరిగిన ఊళ్ళు నీవు తిరిగావా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వాళ్ళు మోపిన భారాన్ని మీరు, మనం కట్టలిసినా పరిస్థితి అన్నారు. నెల కాగానే జీతాలు ఇస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలతో సుజాతనగర్ లో రైతులు ఇబ్బందులు పడితే రైతుకు 6500 ఇప్పించానని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులను రాష్ట్ర బహిష్కరణ చేయాలన్నారు. కొత్తగూడెంలో ఫ్రీ కండిషన్ ఎయిర్ పోర్ట్ రానుందన్నారు. ఆ రోజుల్లోనే కార్గో ప్లెయిన్ కూడా అడిగా అని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లాలో అడవి అనేది లేకుండా పోయిందన్నారు. వైరాలో రైతులకు పంటల పై అవగాహన కోసం హాస్టల్ కట్టించాలని అనుకున్నామన్నారు. కొత్తగూడెం రైల్వే భూములను మనం తీసుకొని వాళ్లకు వేరే భూమి ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఖమ్మంను మర్చిపోనే పోను..నేను ఖమ్మం జిల్లా ఆడబిడ్డను. ఆ బిరుదు అది శాసిత్వం అన్నారు. వచ్చే ఏడాది స్తంభాద్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబోతున్నామని తెలిపారు. మత్స్యకారుల పండుగ రోజున పాలేరులో ఉత్సవాలు జరుపబోతున్నాం అన్నారు. నేలకొండపల్లి బౌద్ధ స్థూపం ను అభివృద్ధి చేయాలని టూరిజం శాఖ మంత్రిని కోరింది అన్నారు. కేటీపీఎస్ లో ఓ స్టేజి వచ్చిందంటే నా కృషి ఉంది అని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పాల్వంచ స్పాంజ్ ఐరన్ ను మూసి వేసిందన్నారు. అక్కడి ట్రేడ్ యూనియన్ నాయకులతో మాట్లాడి మళ్ళీ తెరిపించాలని పోరాటం చేస్తాం అన్నారు. కేటీఆర్ మాటలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరం మొత్తం డొల్ల అంటే మీరు ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. మూసి ప్రక్షాళన ముమ్మాటికీ అవసరమే అన్నారు. ఏనుగులు పోతుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయి.. పట్టించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో జిల్లా అభివృద్ధి కోసం అన్నారు.

## సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనది



హైదరాబాద్ –దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం లోక్ మంథన్ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. హైదరాబాద్ లోని శిల్పారామంలో ఇవాళ లోక్‌మంథన్ కార్యక్రమాన్ని ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. 2018 రాంచీలో జరిగిన లోకమంథన్ లో ప్రత్యక్షంగా పాల్గొన్నానని తెలిపారు. ఆ తర్వాత ఇవాళ మరోసారి లోకమంథన్ లో పాల్గొనే అవకాశం కలిగిందన్నారు. భారతదేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన పరంపర చాలా ఘనమైనవన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం.. పాటిస్తాం అన్నారు. ఇదే మన బలం, ఇదే మన స్థైర్యం అని తెలిపారు. ఇన్ని భిన్న సంస్కృతులు ఒకేచోట ఉండటం నిజంగా చాలా గొప్ప విషయం అన్నారు. ఇవన్నీ కలిసిన సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనదన్నారు. వనవాసి, నగరవాసి అని తేడా లేకుండా మనమంతా భారతవాసులం అనే విషయాన్ని మరవొద్దన్నారు. లోకమంథన్ కార్యక్రమంలో.. అహల్యాబాయ్ హెూల్కర్, రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరాంగనల పై ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని తెలిసి హర్షం వ్యక్తం చేశారు. వారి ప్రేరణ ఎప్పటికీ మనకు అవసరం అన్నారు. విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తుండటం అభినందనీయం అన్నారు. ఇండోనేషియా సహా వివిధ దేశాల ప్రతినిధులు ఈ వేదిక ద్వారా తమ సంస్కృతిని ప్రదర్శిస్తుండటాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. భారతదేశ ఆధ్యాత్మిక భావనలు, కళలు, సంగీతలు, విద్య, వైద్య విధానాలు ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని పొందాయన్నారు. ప్రపంచానికి మనం జ్ఞాన దర్శనం చేశామన్నారు. ప్రపంచమంతా ప్రస్తుత సమయంలో మళ్లీ భారతదేశ జ్ఞానాన్ని పంచాల్సిన అవసరం ఏర్పడింది. విదేశీ శక్తులు శతాబ్దాలుగా మన మీద జులూం ప్రదర్శించాయి. మన సంస్కృతిని, భాషను, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను విధ్వంసం చేశాయి. మనలో ఐకమత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని తెలిపారు. మనలో బానిస మూలాలను చొప్పించారన్నారు. కానీ మన దేశ ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ.. వీటిని నిరంతరం జీవింపజేశారన్నారు. ఇకపైనా వీటిని కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారతదేశం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. రాజ్ పథ్ పేరు కర్తవ్యపథ్ మారిందన్నారు. దర్బార్ హాల్ పేరు.. గణతంత్ర మండప్ గా మార్చామన్నారు. ఇది బానిసత్వ ఆలోచనలను తొలగించే దిశగా జరుగుతున్న ప్రయత్నం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. ఇటీవల.. ఓ హైకోర్టులో మహిళా జడ్జి విగ్రహాన్ని ప్రారంభించారన్నారు. కానీ ఆ విగ్రహం కళ్లకు నల్లని గంతల కట్టలేదని, ఇది మనం సాధిస్తున్న మార్పుకు సంకేతం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. ఐకమత్యం, సమరసతే మన సభ్యత.. మన భవిష్యత్తు అన్నారు. ఈ దిశగా మనమంతా కలిసి పనిచేద్దామన్నారు. లోక్ మంథన్ కార్యక్రమం అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరిగి ఢిల్లీకి ప్రయాణం అయ్యారు. నేటితో తెలంగాణాలో రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన ముగిసింది.

## ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం



న్యూఢిల్లీ,నవంబర్22: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయిలో కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 11.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. దీంతో రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 373తో చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. నగరంలోని మొత్తం 38 మానిటరింగ్ స్టేషన్లలో తొమ్మిదింటిలో ఏక్యూఐ లెవల్స్ తీవ్రమైన కేటగిరీలో నమోదయ్యాయి. ఆనంద్ విహార్, బవానా, జహంగీర్‌పురి, ముండ్కా, నెహ్రూ నగర్, షాదీపూర్, సోనియా విహార్, వివేక్ విహార్, వజీర్‌పూర్‌లో గాలి నాణ్యత సూచీ చాలా అధ్వానంగా ఉంది. ఈ స్టేషన్లలో ఏక్యూఐ లెవల్స్ 400 కంటే ఎక్కువే నమోదైంది. తీవ్ర వాయుకాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను నివేదిస్తున్నారు. ఉదయం 8:30 గంటలకు నగరంలో తేమ స్థాయిలు 97 శాతంగా ఉన్నాయి. రోజంతా మోస్తరు పొగమంచు కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (ఎఓఆ) అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఎన్‌సీఆర్ పరిధిలో గాలి విషపూరితంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. 50శాతం మంది ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం విధానాన్ని అమలు చేస్తున్నది. ఢిల్లీ ప్రభుత్వంలోని 80 విభాగాలు, వివిధ ఏజెన్సీలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం ఉద్యోగుల సంఖ్య దాదాపు 1.40 లక్షలుగా ఉన్నది. అలాగే, గురుగ్రామ్‌లోని ఐటీ కంపెనీలు సైతం ఉద్యోగులకు ఇంటి నుంచే పని చేసే అవకాశం కల్పిస్తున్నది. గురుగ్రామ్, సోనిపట్, ఫరీదాబాద్‌తో పాటు ఎన్‌సీఆర్‌లోని పలు నగరాల్లో కాలుష్యం కారణంగా కళాశాలలు మూతపడ్డాయి. భవన నిర్మాణం, కూల్చివేతలపై కూడా ప్రభుత్వం నిషేధం విధించింది.

## స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు



హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల అనర్హతపై తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు హైకోర్టు సూచించింది. పదో షెడ్యూల్ ప్రకారం, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని దృష్టిలో ఉంచుకుని అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఐదేండ్ల అసెంబ్లీ గడువు దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది. ఈ మేరకు హైకోర్టు సీజే నేతృత్వంలోని ధర్మాసనం తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలనే వ్యాజ్యాలపై సింగిల్‌జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతిస్తూ సింగిల్‌జడ్జి సెప్టెంబర్ 9న ఇచ్చిన తీర్పును కొట్టేయాలని అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు మరో పిటిషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ ఈ నెల 12న వాదనలు ముగించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. సింగిల్‌జడ్జి తీర్పును రద్దు చేయాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదించారు. దీనిపై బీఆర్ఎస్ తరపు సీనియర్ న్యాయవాదులు మోహన్‌రావు, జే రామచందర్‌రావు ప్రతివాదనలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంలో సింగిల్‌జడ్జి జోక్యం చేసుకోలేదని తెలిపారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసేందుకు వెళితే స్పీకర్‌కు పిటిషన్ తీసుకోలేదని, అందువల్లే హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు.

## రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ : హరీశ్ రావు



ఖమ్మం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బోనస్ మాట బోగస్ అయిందని.. మద్దతు ధర కూడా రావట్లేదని విమర్శించారు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆరోపించారు. మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, గంగుల కమలాకర్, ఎంపీ వద్దరాజు రవిచంద్రతో కలిసి ఖమ్మం పత్తి మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ అలసత్వంతో పత్తి రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ రైతులను నట్టేట ముంచిందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని విమర్శించారు. పత్తికి రూ.500 బోనస్ ఇస్తామన్నారని, ఇప్పుడు బోనస్‌ను బోగస్‌గా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. కనీస మద్దతు ధర వచ్చే పరిస్థితి కూడా లేదని చెప్పారు. దీంతో పత్తి ప్రతి క్వింటాకు రైతుకు రూ.1500 నష్టం వస్తున్నదన్నారు. పత్తి రైతులు రైతులకు సాయం చేయడానికి ప్రభుత్వానికి ఎందుకు ఇబ్బందని ప్రశ్నించారు. రైతులను వ్యవసాయ కూలీలను ఆదుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల పత్తి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీసీఐ రైతుల దగ్గర పత్తి కొనడం లేదని, దళారుల వద్ద కొంటున్నదని చెప్పారు. రాష్ట్రంలో పత్తి రైతులకు మద్దతు ధర రావట్లేదని చెప్పారు. 2021లో తాము రూ.11 వేలకు పత్తి కొనుగోలు చేశామని గుర్తుచేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రూ.7 వేలకు తక్కువగా ఎప్పుడూ పత్తి కొనుగోలు చేయలేదన్నారు. దళారుల దోపిడీ వల్లే ధర తగ్గిందని చెప్పారు. మద్దతు ధర రూ.7,520 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం మార్కెట్‌లో ఇప్పటి వరకు మద్దతు ధర రాలేదని చెప్పారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఆధిపత్యం కోసం బాగా బిజీ అయ్యారని, రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడం, కుట్రలు చేయడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. సగానికిపైగా ధాన్యం దళారుల పాలైందని చెప్పారు. మిర్చి రైతులను కూడా ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిదన్నారు. ముఖ్యమంత్రి పత్తి కొనుగోలుపై ఇప్పటివరకు సమీక్ష చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు నష్టపోతున్నారని, దళారులు లాభపడుతున్నారని వెల్లడించారు. పత్తిని సీసీఐ కేంద్రాలు కొన్నది తక్కువ.. వ్యాపారులు కొన్నది ఎక్కువని చెప్పారు.

## ఆదానీతో చంద్రబాబు బంధం తెంచుకోవాల్సిందే



అమరావతి,నవంబర్22:ప్రభాస్ ఎవరో తనకు ఇప్పటికీ తెలియదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తన సైతాన్ సైన్యంతో ప్రభాస్‌తో తనకు సంబంధం ఉన్నట్లు ప్రచారం చేయించారని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో జగన్ మోహన్ రెడ్డి , ఆదానీలపై వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను ప్రభాస్ అనే వ్యక్తిని ఇంత వరకూ చూడలేదు. నా బిడ్డలపై ప్రమాణం చేసి చెబుతున్నా, ప్రభాస్ ఎవరో నాకు ఇప్పటికీ తెలియదు. ఆయనతో నాకు ఎలాంటి సంబంధం లేదు. జగన్‌కు ఇవ్వన్నీ తెలిసి కూడా, నాకు వ్యక్తిత్వం లేనట్లు ప్రచారం చేయించారు. ప్రభాస్‌తో సంబంధం ఉన్నట్లు గత ఐదేళ్లుగా జగన్ తన సైతాన్ సైన్యంతో సోషల్‌మీడియా వేదికగా విమర్శలు చేయించింది నిజం కాదా? మీకు చెల్లెలిపై ప్రేమ ఉందా? అసలు మీకు సిగ్గు ఉందా?మళ్లీ నా వీడియోనే ప్లే చేసి, మీకు మైలేజీ వచ్చేటట్లు వాడుకుంటున్నారు. మీకు పేరు వస్తుందంటే తల్లి, చెల్లి ఎవరి పేరైనా వాడేస్తారు. నాన్న పేరు సీబీఐ ఛార్జ్ షీట్‌లో పెట్టిస్తారు. మీకు మీరే సాటి‘ అంటూ తీవ్ర స్థాయిలో అన్న జగన్ మోహన్‌రెడ్డిపై మండిపడ్డారు. ఏపీ మాజీ సీఎం జగన్‌కు పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ రూ.1,750 కోట్ల లంచం ఇచ్చినట్లు అమెరికా ఏజెన్సీల దర్యాప్తులో వెల్లడైన నేపథ్యంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ తన స్వప్రయోజనాల కోసం చెల్లి, తల్లి పేర్లను వాడుకుంటున్నారని మండిపడ్డారు. బాలకృష్ణగారి నివాసంలో ఉన్న ఐపీ అడ్రస్ నుంచి నాపై తప్పుడు ప్రచారం జరిగిందని జగన్‌మోహన్‌రెడ్డి కేసు పెట్టినట్లు ఇటీవల ఎంటర్‌టైనింగ్‌గా చెప్పారు. మీకు నిజంగానే చెల్లెలిపై ప్రేమ ఉంటే, బాలకృష్ణగారి నివాసంలోని సిస్టమ్ ఐపీ అడ్రస్ నుంచి తప్పుడు ప్రచారం జరిగిందని నమ్మితే, ఐదేళ్లు సీఎంగా ఉండి మీరేం గాడిదలు కాశారు? బాలకృష్ణ మీద ఎందుకు విచారణ చేపట్టలేదు? మీరిప్పుడు చెల్లెలిపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ప్రభాస్‌కూ నాకూ సంబంధం ఉందని నాపై జరిగిన అసత్య ప్రచారంపై నేను కేసు పెట్టిన వెంటనే ఎందుకు స్పందించలేదని అన్నారు. నా మీద బాలకృష్ణ ఇంటి నుంచి తప్పుడు ప్రచారం జరిగిందని జగన్ ఒక్క ఎంటర్‌టైన్‌మెంట్ వీడియో చూయించారు. మీకు ఇలా జరిగిందని తెలిసి ఉంటే మీరు ఐదేళ్లు సీఎంగా ఉన్నారు. అప్పుడు గాడిదలు కాశారా. విచారణ ఎందుకు చేయలేదు. ప్రభాస్‌కు నాకు సంబంధం ఉందని వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేయలేదా. మా పిల్లల మీద ఒట్టేసి చెబుతున్న ప్రభాస్ ఎవరో నాకు తెలియదు. ఆయన్ని నేను ఎప్పుడూ చూడలేదు. జగన్ ఈ ప్రచారం చేయించారు. నా వీడియో చూయించి జగన్ సానుభూతి పొందాలని చూశారు. జగన్ ఆయన స్వార్థం కోసం అమ్మపై కేసు పెడతారు ...నాన్న పేరు సీబీఐ చార్జి షీట్‌లో పెడతారు.. తనపై దుష్ప్రచారం చేయిస్తారు‘ అని వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బాటలో ఏపీ సీఎం చంద్రబాబు నడవొద్దు. ఇక మీదట ఏపీ నుంచి అదానీకి ప్రాజెక్ట్స్ ఇవ్వొద్దు. మోదీ అదానీ వేర్వేరు కాదు. మోదీ అదానికి రక్షణ కల్పిస్తున్నారు. అదానీ మోదీకి డబ్బులు ఇస్తున్నారు. సెబీ చీఫ్ కూడా అదానీ చేతిలో ఉంది. అదానీపై అమెరికాలో కేసు నమోదు చేసిన భారతదేశంలో ఆయనపై ఎటువంటి చర్యలు లేవు. దీన్ని చూస్తేనే అర్థం అవుతుంది మోదీ అదానీల బంధం అని విమర్శలు గుప్పించారు. పదేళ్లలో అదానీ అందనంత ఎత్తుకు ఎదిగాడు. ఇంత డబ్బులు సంపాదించడం ఎలా సాధ్యం. అదానీ వ్యవహారం మోదీకి , దేశానికి అవమానం. కాంగ్రెస్ అడిగే ఒక్క ప్రశ్నకు అయిన మోదీ సమాధానం చెప్పాలి. మోదీ అదానీనీ అమెరికాకు అప్పగిస్తారా. మోదీ అండతోనే దేశంలో ఇంత అవినీతి జరుగుతుంది. జస్టిస్ డిపా÷–టం÷–మెంట్ ఆఫ్ యూఎస్ఏ గౌతమ్ అదానీపై అభియోగాలు చేసింది. అదానీ టీం దేశంలో కొంతమంది సీఎంలకు లంచాలు ఇచ్చింది. ఇందులో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి ఇచ్చింది. ఆగస్టు 2021లో జగన్‌కు ముడుపులు ముట్టాయి. పవర్ సప్లైలో అదాని జగన్‌ను కలిసి మీకు ఏమి కావాలో ఇస్తామని ప్రామిస్ చేశారు‘ అని వైఎస్ షర్మిల గుర్తుచేశారు. ‘అదానీతో జగన్‌కు కొన్ని కీలక విషయాల్లో డిస్కస్ జరిగింది. జగన్ మోదీకి దత్త పుత్రుడు. ఆయన మీద విచారణ చేయిస్తారా. అదానీపై జేపీసీ వేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదానీనీ బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. ఒక సహచరిగా రేవంత్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను.. అదానీతో బిజినెస్ చేయొద్దు. నేను జగన్మోహన్ రెడ్డినీ ఎత్తి చూపకపోతే నా ఆస్తి నాకు ఇస్తానని అంటున్నారు. కానీ నేను మాట్లాడకుండా ఉండలేను. నేను కాంగ్రెస్ పార్టీ చీఫ్ ... ఇలాంటివి నేను మాట్లాడకుంటే ఎలా‘ అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు.

### చెత్తపన్ను రద్దుకు అసెంబ్లీ ఆమోదం

అమరావతి,పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్ను రద్దుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ బిల్లు ప్రవేశపెట్టగా స్వల్ప చర్చతో సభ ఆమోదించింది. దీంతో సర్వత్రా హర్ష్ వ్యక్తం అవుతోంది. గతంలో వైఎస్ జగన్ హయాంలో చెత్తపన్ను వేయగా, రాష్ట్రంలో నిరసనలు పెల్లుబికాయి. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో చెత్తపన్ను వసూలు, కాంట్రాక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

## సంపాదకీయం

శనివారం 23-11-2024

### ఎగ్జిట్ పోల్స్ ఫలితాల పట్ల ప్రజల్లో పెరుగుతోన్నఅనాసక్తత

దేశంలోనే కాదు ఎక్కడ ఎన్నికలు జరిగినా సర్వే సంస్థల ద్వారా ప్రజాభిప్రాయంపై ముందే ఒక అంచనా వస్తుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ సర్వే అంచనాలు తలకిందులవుతున్నాయి. వాటిలో ఖచ్చితత్వం లోపించింది. దాంతో ప్రజలు సర్వే ఫలితాల పట్ల ఆసక్తిని కోల్పోతున్నారు. ఇటీవల ముగిసిన అమెరికా అధ్యక్ష ఎన్నికలతో పాటు .. మన దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు.. ఇటీవలి హర్యానా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు అందుకు తాజా ఉదాహరణలు. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమాక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్ మధ్య హోరా హోరీ తప్పదని దాదపు అన్ని సర్వేలు చెప్పాయి. కానీ ఫలితం అందుకు భిన్నంగా వచ్చిం ది. ట్రంప్ బంపర్ మెజార్టీతో గెలిచారు. అలాగే, ఈ ఏడాది జరిగిన మన దేశ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు నల్లేరు మీద నడక అన్నారు. గత రెండు ఎన్నికల్లో కంటే ఈ సారి ఇంకా ఎక్కువ సీట్లు వస్తాయని దాదాపు అన్ని సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చివరకు ఏమి జరిగిందో తెలుసు. ఏపీ ఎన్నికల్లో కూడా అన్ని అంచనాలు తప్పి టీడీపీ దాని మిత్రపక్షాలు కనివిని ఎరుగని గెలుపును సొంతం చేసుకున్నాయి. అలాగే అత్యంత తాజాగా హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కాం గ్రెస్ విజయం తథ్యమని దాదాపు అన్ని సర్వే సంస్థలు ముక్తకంఠంతో ఘోషించాయి. చివరకు ఏమి జరిగింది? బీజేపీ అఖండ విజయం సాధించింది. సాధారణ సర్వేలు లెక్కతప్పితే అనుకోవచ్చు ..కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే జరిపే ఎగ్జిట్ పోల్స్ లెక్కలు కూడా ఘోరంగా తప్పుతున్నాయి. అందువల్ల ప్రజలు మునపటిలా ఇప్పుడు ఎగ్జిట్ పోల్ ఫలితాల పట్ల ఆసక్తి ప్రదర్శించటం లేదు. తాజగా వెల్లడైన మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ పట్లను ఎవరూ పెద్దగా పట్టించుకోవట్లేదు. ఇటు రాజకీయ నేతలు, అటు ప్రజల్లో కూడా దీనిపై పెద్ద చర్చ లేదు. చర్చలు కేవలం మీడియా సంస్థలకే పరిమితమయ్యాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఎగ్జిట్ పోల్స్ పై టీవీ డిబేట్లకు దూరంగా ఉంది. కాగా, మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని ఎక్కువ సర్వేలు అంచనా వేశాయి. 288 స్థానాలు కలిగిన మహారాష్ట్ర అసెంబ్లీలో కనీస మెజార్టీ సాధించాలంటే 145 సీట్లు గెలవాలి. బీజేపీ నేతృత్వంలోని కూటమి 150 నుంచి 170 స్థానాలు గెలుచుకునే అవకాశముందని మాట్రిజ్ సర్వే అంచనా వేసింది. కాంగ్రెస్ కూటమి 110 నుంచి130 స్థానాలు సాధించవచ్చని అంచనా వేసింది. ఇతరులు 8 – 10 సీట్లు గెలుచుకోవచ్చని తెలిపింది. పీపుల్స్ పల్స్ అంచనా ప్రకారం, మహాయుతి 182 స్థానాల్లోనూ, మహా వికాస్ అఘాడీ 97 స్థానాల్లోనూ గెలిచే అవకాశముంది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి 152 – 160 స్థానాలను సాధించే అవకాశముందని, కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ 130 – 138 స్థానాల్లో గెలిచే అవకాశముందని చాణక్య స్టాట్రజీస్ అంచనా వేసింది. మహాయుతి 137– 157 సీట్లు, మహా వికాస్ అఘాడీ 126–146 స్థానాలు గెలుచుకునే అవకాశముందని పీ? మార్క్ సర్వే పేర్కొంది. లోక్‌షాహి–మరాఠి–రుద్ర సర్వే అంచనాల ప్రకారం, మహాయుతి 128 – 142 స్థానాల్లో, ఎంవీఏ 125 ? 140 సీట్లలో గెలుపొందే అవకాశముంది. టైమ్స్ నౌ–జేవీసీ అంచనా ప్రకారం, మహాయుతి 150–167 సీట్లు, ఎంవీఏ 107–125 స్థానాలు, ఇతరులు 13 నుంచి 14 సీట్లు గెలుచుకునే అవకాశముంది. ఇక, ఝార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. ఝార్ఖండ్‌లో దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్ సర్వేలూ.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందన్న అంచనాలను వెలువరించాయి. ఎన్డీఏకు 42–47 సీట్లు రావొచ్చని మాట్రిజ్ సర్వే అంచనా వేసింది. జేఎంఎం నేతృత్వంలోని ఆల్ ఇండియా కూటమికి 25–0 సీట్లు, ఇతరులకు 1–4సీట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పింది. పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం, ఎన్డీఏకు 42–48 సీట్లు, ఇండియా కూటమికి 16–23 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ÷ఖటికి భిన్నంగా ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని యాక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. ఇండియా కూటమి 53 స్థానాలు, ఎన్డీఏ 25 స్థానాలు గెలుచుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఝార్ఖండ్‌లో ఎన్డీఏ 45 నుంచి 50 సీట్లు సాధించే అవకాశం ఉందని చాణక్య స్టాట్రజీస్ అంచనా వేసింది. ఇండియా కూటమి 35–38 సీట్లు, ఇతరలు 3–5 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. టైమ్స్ నౌ–జేవీసీ సర్వే, ఎన్డీఏ 40–44 స్థానాలతో ముందంజలో ఉంటుందని, ఇండియా కూట మి 30–40 స్థానాలు గెలుచుకునే అవకాశముందని, ఇతరులు ఒక చోట గెలుపొందుతారని అంచనావేసింది. ఈ నెల 23న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. ఈసారైనా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమవుతాయో లేదో చూడాల్సివుంది.

# ఎఐతో మత్స్యరంగానికి లాభమా?



హైదరాబాద్,భారత దేశంలో తరతరాలుగా కోట్లాది మందికి ఉపాధిని అందించడంతో పాటుగా ఆరోగ్యకరమైన పౌష్టిక మాంసాహారాన్ని అందిస్తున్న మత్స్యరంగం మీద కృత్రిమ మేధస్సు సునామీలా విరుచుకుపడబోతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నవంబర్ 8వ తేదీన కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్ నగరంలో కేంద్ర సముద్ర జలవనరుల మత్స్యపరిశోధనా కేంద్రం (సిఎంఎఫ్ఆర్ఐ)లో నిర్వహించిన మత్స్యకారుల చైతన్య సదస్సు సందర్భంగా కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ కృత్రిమ మేధస్సు ఆధారిత ఉపరితల డ్రైన్ యంత్ర పరికరాన్ని ప్రదర్శించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వాస్తవానికి 2024 సంవత్సర ఆరంభంలోనే జనవరి 5వ తేదీన ఇదే ప్రాంగణంలో 'నీతిఆయోగ్' జాతీయ ఉపాధ్యక్షులు సుమన్ భేరీ సమక్షంలో జరిగిన సమాలోచన సందర్భంలోనే మత్స్యరంగం అభివృద్ధికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (కృత్రిమ మేధస్సు) సహాయంతో ఉపరితల డ్రోన్లు, రోబోటిక్ యంత్ర పరికరాలు, జలాంతర్గాముల్లాంటి' అండర్ వాటర్ డ్రోన్ల'ను ఉపయోగించుకుని దేశంలోని ఆక్వాకల్చర్, మత్స్యరంగాలలో సాధించగలిగే పురోభివృద్ధిపై మేధోమథనం జరిగింది.తొలిదశలో ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ కృత్రిమ మేధస్సు ఎఐ) సముద్ర తీరప్రాంతాలను కలిగి ఉన్న రాష్ట్రాలలో మాత్రమే వినియోగించాలని నిర్దేశించుకున్నట్లు బహిరంగ పరుస్తున్నప్పటికీ, తదనంతర విస్తరణలో భాగంగా చేపల ఉత్పత్తితో ముడిపడి ఉన్న అన్ని ప్రక్రియలలోనూ, దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ఉపయోగించవలసిన తప్పనిసరి పరిస్థితులు నెలకొంటాయని ఈ రంగం మీద పరిశోధనలు నిర్వహిస్తున్న మత్స్యరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొచ్చిన్‌లో కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత క్రేన్ల పని తీరును ప్రదర్శించిన సందర్భంగా కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ప్రస్తావించిన అంశాల సారాంశం ప్రకారం, సముద్రంలో మత్స్యకారులు పట్టిన చేపలను సునాయాసంగా ఒడ్డుకు చేర్చడానికి, చేపలవేటకు వెళ్లిన జాలర్లకు సంబంధించిన మర పడవలకు రక్షక కవచంగా వినియోగించడానికి, నడిసముద్రం లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదంలో చిక్కుకున్న సందర్భాలలో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేరవేసేందుకు, సముద్రంలో చట్ట వ్యతిరేకంగా నిర్వహించే చేపల వేటను నిలువరించేందుకు, సముద్రంలోని చేపల ఆరోగ్యాలను సంరక్షించేందుకు అనుగుణంగా ఈ డ్రోన్లను వినియోగిస్తారు.ఫలితంగా సముద్రంలో చేపలుపట్టే మత్స్యకారులకు ఈ డ్రోన్లు అన్ని రకాలుగా సహాయకారిగానూ, రక్షక కవచంగానూ, శ్రమను తగ్గించే విధంగానూ, సముద్రంలో పట్టిన చేపల నాణ్యతను కాపాడే విధంగానూ, సకాలంలో సముద్రం నుండి చేపలను మార్కెట్‌కు చేర వేసేందుకుగానూ ఉపయోగపడతాయి. అంతేకాకుండా, సముద్ర గర్భంలో వినియోగించే అండర్ వాటర్ డ్రోన్ల సహకారంతో చేప పిల్లల ఆరోగ్య, ఆహార సమస్యలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడంతోపాటుగా అందుకు సంబంధించిన తరుణోపాయాలను కూడా అమలుపరుస్తారు. ఈ పనుల పర్యవసానంగా నానాటికీ తగ్గుముఖం పడుతున్న సముద్రచేపల ఉత్పత్తులను ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవడంవల్ల మత్స్యకారుల ఆదాయ వనరుల్లో గణనీయమైన వృద్ధిరేటును సాధించేందుకు అవకాశాలు మెరుగుపడతాయి.ఇక కృత్రిమ మేధస్సు అనుసంధానంతో నిర్వహించే రోబోటిక్ యంత్రాలు సముద్రంలో కేజ్ కల్చర్ లాంటి ఆధునిక చేపల పెంపకానికి సంబంధించిన అనేక క్లిష్టమైన విధులను ఎంతో సమర్ధవంతంగానూ, సులభంగానూ నిర్వహిస్తాయి. సముద్రంలో ఆధునిక పరిజ్ఞానంతో నిర్వహించే కేజ్ కల్చర్‌ను మానవ రహిత డ్రోన్ పరికరాలు, రోబోటిక్ యంత్రాలు, అండర్ వాటర్ డ్రోన్ల సహకారంతో రిమోట్ కంట్రోల్ ఆపరేషన్ల పద్ధతిలో సముద్రతీరం నుండి నిర్వహిస్తారు. మొత్తంగా మత్స్యకారుల ప్రమేయం లేకుండానే సముద్రంలో కృత్రిమ పద్ధతులలో, కృత్రిమ మేధస్సు వినియోగంతో చేపల పెంపకానికి సంబంధించిన ప్రక్రియలన్నింటినీ నిర్వహించగలుగుతారు. మత్స్యకారులకు సహాయకారిగా ప్రారంభమయ్యే కృత్రిమ మేధస్సు అంతిమంగా మత్స్యరంగాన్ని తన గుప్పిట్లోకి బిగించుకుంటుంది. కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా సముద్ర జలవనరుల చేపల పెంపకానికి సంబంధించిన కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేయనున్నట్లుగా ఉన్నతాధికార వర్గాలు నమ్మబలుకుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మత్స్యశాఖ రానున్న నాలుగు సంవత్సరాల కాలానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించడానికి ఉపరితల జలవనరులకు సంబంధించిన మత్స్య రంగాలకు కూడా ఈ అత్యాధునిక ఆవిష్కరణలు పరోక్ష పద్ధతుల్లో చొరబడటం ఖాయంగా కనిపిస్తున్నది.దేశవ్యాప్తంగా విస్తరించుకుని, సాంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధికి జీవనాడిగా ఉపయోగపడుతున్న చెరువులు, కుంటలు, వాగులు, వంకలు లాంటి చిన్న నీటి వనరులలో ఎఐ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు అవకాశాలు పెద్దగా లేకపోయినప్పటికీ పెద్దపెద్ద చెరువులు, భారీజలాశయాలు, ప్రాజెక్టులకు సంబందించిన బ్యాక్ వాటర్స్‌లలోను, నీటిపారుదల ప్రాజెక్టులులాంటి నీటి వనరులలో చేపట్టి చేపల పెంపకానికి సంబంధించిన కార్యకలాపాలలో అనివార్యంగా కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక ఉపకరణాలు, అత్యాధునిక యంత్రాలు వినియోగంలోకి తీసుకురావడం అనివార్యంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా మన దేశం నుండి ఇతర దేశాలకు చేపలను, చేపల ఆహారాన్ని ఎగుమతులను భారీ ఎత్తున పెంపొందించడం ద్వారా సమీప భవిష్యత్తులో లక్ష కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రప్రభుత్వం సముద్ర జలాల నుండి ఉత్పత్తి చేసి ఆక్వా ఉత్పత్తులతో పాటుగా, ఉపరితల జలవనరుల నుండి చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచుకోవాలని ఆలోచిస్తున్నది.ప్రధాన మంత్రి పెంట చేపట్టి అమలుపరుస్తున్న పిఎంఎంఎస్‌వై, పిఎంఎంకెఎస్ఎస్‌పై ద్వారా అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన అంతర్గత లక్ష్యాలు కూడా ఇందుకు అనుకూలంగానే ఉన్నాయి. ఉపరితల జలవనరుల నీటి విస్తీర్ణంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తున్న తెలంగాణ లాంటి కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలోని రిజర్వాయర్లు, నీటిపారుదల ప్రాజెక్టులలో అత్యాధునిక పద్ధతులను అమలు పరచడం ద్వారా చేపల ఉత్పత్తిని భారీ యెత్తున పెంచేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. ప్రతి హెక్టారుకు కనీసం మూడు నుండి ఐదు టన్నుల చేపలను పెంచేందుకు అవకాశాలున్నప్పటికీ, తెలంగాణలో మాత్రం హెక్టారుకు టన్ను చేపలను కూడా ఉత్పత్తి చేయలేకపోతున్నారని, ఇందుకు ఇక్కడి సాంప్రదాయ మత్స్యకారుల్లో వృత్తి నైపుణ్యం లేకపోవడమే ప్రధాన కారణంగా ఈ –రంగానికి సంబంధించిన నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే సిరిసిల్ల జిల్లా కేంద్రానికి అనుకుని నిర్మించిన మిడ్ మానేర్ డ్యాం (యంయండి) పరీవాహక ప్రాంతంలో ప్రయోగాత్మకంగా ఒక పిషరీస్ హట్ ను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం విఫలయత్నం చేసింది. అయితే స్థానికంగా పరిస్థితులు అనుకూలించకపోవడం, తదితర కారణాలవ ల్ల మిడ్ మానేరులో భారీ పెట్టుబడులతో పెద్ద ఎత్తున నిర్వహించతల పెట్టిన కేజ్ కల్చర్ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అప్పటి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకురాలేకపోయింది. తెలంగాణలో కేజ్ కల్చర్ పద్ధతులను పెద్ద ఎత్తున అమలులోకి తీసుకురావడానికి ఇక్కడి మత్స్యశాఖ చేసిన ప్రయత్నాలన్నీ కూడా ఏ మాత్రం ఆశించిన ఫలితాలను సాధించలేకపోయాయి. పైగా స్థానిక మత్స్యకారుల్లో కేజ్ కల్చర్ అనే అధునాతన పద్ధతి ఇక్కడి పరిస్థితులకు అనుకూలం కాదనే దురభిప్రాయం స్థిరపడిపోయింది. రీ–సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టం (ఆర్ఎఎస్), బయో ఫ్లాక్ ఫిష్ ఫార్మింగ్ టెక్నాలజీ పెన్ కల్చర్, రేస్ వేస్ లాంటి ఇతర రకాలైన ఆధునిక చేపల పెంపకానికి సంబంధించిన ప్రయోగాల విషయంలోనూ కేజ్ కల్చర్ లాంటి అనుభవాలే ఎదురయ్యాయి. ఆ శాఖకు సంబంధించిన అధికారుల్లో సరైన అవగాహన, దీక్షాదక్షతలు లేని కారణంగానే. తెలంగాణ మత్స్యరంగంలో ఆధునిక విధానాల పట్ల ఇక్కడి సాంప్రదాయ మత్స్యకారుల్లో నిర్లిప్త ధోరణులు ప్రబలిపోవడానికి మరో ప్రధాన కారణంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# కెనడాలో ఖలిస్తానీయుల కొత్తనాటకం!




కెనడాలో దేశ ప్రధాని జస్టిస్ ట్రూడో అండ చూసుకొని "ఏకు మేకై"న అక్కడ ఖలిస్తాన్ సానుభూతిపరులు.. స్థానిక పౌరులనే బెది రించే స్థాయికి తెగబడ్డారు. వారు ఇప్పుడు అక్కడ మరో కొత్త నాటకానికి తెర తీశారు. ఇప్పటివరకు హిందువులను లక్ష్యంగా చేసు కొని దాడులు చేసిన ఈ మూకలు తాజాగా స్థానికులైన కెనడా వాసులనే హెచ్చరించడం ప్రారంభించారు. నిన్నటి దాకా తమ కష్టా లకు భారతదేశమే కారణమంటూ అకారణంగా నిందిస్తూ వచ్చిన వారు.. ఇప్పుడు కెనడాలో స్థానికులుగా ఎన్నో ఏళ్లుగా స్థిరపడి జీవిస్తున్న వారిపైనే విమర్శలు గుప్పిస్తున్నా రు. చివరకు బెదిరింపుల దాకా వచ్చారు.

ఇది మా దేశం అంటూ..

ఇటీవల జరిగిన నగర సంకీర్తనలో పాల్గొన్న కొందరు వ్యక్తులు ఇలాంటి హెచ్చరికలు చేస్తూ రెండు నిమిషాల నిడివిగల వీడియోను కూడా విడుదల చేశారు. "ఇది కెనడా. ఇది మా సొంత దేశం. మీరు మీ సొంత దేశాలకు తిరిగి వెళ్లిపోండి" అంటూ హెచ్చరించడం అందులో కనిపించింది. దీనిపై భారత నిఘా వర్గాలు స్పందిస్తూ కెనడాలో ఇలాంటి సంఘటనలు ఇటీవల కాలంలో సర్వసాధారణం అయ్యాయని అభిప్రాయపడ్డాయి. అక్కడ తగిన నిఘా లేకపోవడంతో వారు అన్ని వ్యవస్థలను అదుపు చేస్తున్నారని తెలిపాయి. భద్రంగా ఉండాలంటే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వచ్చిన వారు, ఇప్పుడు ఏకంగా స్థానికులను కూడా అదే విధంగా హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. ఖలిస్థాన్ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని ఇండియా ఏజెంట్లు పనిచేస్తున్నారంటూ సాక్షాత్తు కెనడా ప్రధానమంత్రి జస్టిస్ ట్రూడో ప్రకటించిన దగ్గర నుండి రెండు దేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇరు దేశాల దౌత్య వేత్తలను పరస్పరం బహిష్కరించుకునే స్థాయి వరకు పరిస్థితి వెళ్ళింది. ట్రూడో ఆరోపణలను ఖండించిన భారత ప్రభుత్వం ఉగ్రవాదులకు జస్టిస్ ట్రూడోనే స్వయంగా ఖలిస్థాన్ తీవ్రవాదులకు ఆశ్ర యం కల్పిస్తున్నారని ప్రత్యారోపణలు చేసిం ది. ఖలిస్తాన్ తీవ్రవాదులు భారత్‌లో అల్లర్లు సృష్టించడానికి కుట్ర పన్నుతుండడంతో పాటు, కెనడాలోని హిందువుల పైన కూడా దాడులు చేస్తున్నారని తెలిపింది.

హుందాగా ప్రవర్తించకుండా..

కెనడాలో ప్రజాధరణ కోల్పోయిన తన పార్టీ ఎంపీ జగ్మీత్ సింగ్‌ను వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికల్లో గెలిపించడానికి జస్టిస్ ట్రూడో స్వయంగా ఖలిస్థాన్ తీవ్రవాదులకు మద్దతు ఇస్తున్నారని భారత నిఘా వర్గాలు అంచనా వస్తున్నాయి. అందుకే ఎలాంటి ఆధారాలు లేకుండానే భారత్‌పై బాధ్యత లేకుండా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొ న్నాయి. అయిన దానికి, కానిదానికీ.. ప్రతిదానికీ ...భారత్‌నే టార్గెట్ చేస్తూ నిందిస్తూ దేశ ప్రధానిగా హుందాగా ప్రవర్తించకుండా, చిన్నపిల్లాడిలా వ్యవహరిస్తున్నారు. ఐఎస్ఐ, ఖలిస్థాన్ వాదుల చేతిలో చిక్కుకొని ఎంత ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారో ఆయన గుర్తించడం లేదు. కొందరు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఖలిస్తాన్ సానుభూతిపరుల హత్యలో భారతదేశ హస్తం ఉందంటూ ఆరోపణలు చేశానని ట్రూడో గతంలో ఒకసారి స్వయంగా చెప్పారు. అంటే సరైన దర్యాప్తు చేయకుండానే, బలమైన సాక్షాధారాలు లేకుండానే, ఎంతో కాలంగా స్నేహ సంబంధాల గల దేశంపై తీవ్ర ఆరోపణలు చేయటం తగునా? ఇటీవల కెనడా పార్ల మెంట్ మొత్తం ఖలిస్థాన్ సానుభూతి పరు లతో నిండిపోయింది. వారు ట్రూడో పై కూర్చుని స్వారీ చేస్తున్నారు. ఇలా ఏ రకంగా చూసినా సరే.. కెనడా అనుసరిస్తున్నది ప్రమాదకరమైన విధానమేనని చెప్పక తప్పదు.

# భవిష్యత్ ఎజెండా సిపిఎస్ రద్దు

న్యూఢిల్లీ, సిపిఎస్ రద్దు ఇప్పుడు ఎన్నికల ఎజెండాగా మారింది. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు లెఫ్ట్ పార్టీలతో పాటు అన్ని వర్గాలు మద్దతుగా నిలుస్తున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో కూడా దీని ప్రభావం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగులు ఎవరివైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు అంశాన్ని ఎజెండా పైకి తెచ్చారు. ఇక్కడ బిజెపి ఓటమి పాలైతే సిపిఎస్ రద్దుకు సానుకూల పరిస్థితి ఏర్పడవచ్చు. ఇప్పుడు దేశంలో ఓపిఎస్ అమలవుతున్న రాష్ట్రాల సంఖ్య ఐదుకు చేరింది. జమిలి ఎన్నికలు వస్తే సిపిఎస్ సమస్యను ఎన్నికల ఎజెండాగా మార్చాల్సిన అవసరముంది. ఇక్కడ కూడా ప్రధానంగా ఓపిఎస్ అమలుకు మోకాలు అడ్డం పెడుతున్న పార్టీ బిజెపి. మిగతా పార్టీలపై ఒత్తిడి పెంచగలిగితే సిపిఎస్ రద్దుకు గట్టి హామీ పొందగల అవకాశం వుంది. జాతీయస్థాయిలో జమిలి ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నది. జాతీయ ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల్లో శాసనసభలకు ఒకేసారి ఎ÷–నికలు నిర్వహిస్తే సిపిఎస్ వేడి తగలక మానదు. ఎన్నికల్లో ఆశించిన విధంగా సిపిఎస్ రద్దుకు కట్టుబడిన ప్రభుత్వాలు వచ్చినట్లైతే, సిపిఎస్ రద్దు విషయాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విస్మరించలేని ఒక అనివార్య పరిస్థితి ఏర్పడుతుంది. సిపిఎస్ రద్దు కావాలంటే దేశంలో ఈ సానుకూల పరిస్థితులే సమకూరాలి. ప్రస్తుత మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో సీన్ రివర్స్ కాక తప్పదని లెఫ్ట్ పార్టీలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ అంచనాలు వాస్తవ రూపం దాల్చాలంటే, జమిలి ఎన్నికలకు ముందు ఆయా రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సిపిఎస్ వ్యతిరేక ఉద్యమం ఊపందుకోవాలి. అందు కోసం సదస్సులు, సెమినార్లు, ధర్నాలు, ఆందోళనలు అవిశ్రాంతంగా జరుగుతూనే వుండాలి. చిన్న చిన్న అవరోధాలకే ఆగిపోకూడదు. పాలక వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం ఎంతకైనా తెగిస్తాయి. సిపిఎస్ వ్యతిరేక ఉద్యమాన్ని జగన్ ప్రభుత్వం అణచివేసిన తీరు దీనికి ఉదాహరణ. కాబట్టి జావగారిపోవడం కాదు. తట్టుకొని నిలబడాలి. అందుకు ఐక్య కార్యాచరణ అత్యవసరం. ఉద్యోగులు వారి సంఘాల మధ్య పూర్తిస్థాయి ఐక్యత సాధించడంతో పాటు కార్మిక సంఘాల సహకారాన్ని కూడా తీసుకోవాలి. వాస్తవానికి సిపిఎస్ చట్టం కాకుండా 2004 నుండి దాదాపు దశాబ్ద కాలం పాటు పార్లమెంట్‌లో పోరాడింది వామపక్షం. కాబట్టి సిపిఎస్ వ్యతిరేక ఉద్యమానికి వామపక్ష పార్టీలు, వాటి ఆధ్వర్యంలోని ప్రజాసంఘాలు నిజమైన మిత్రులు. ఈ విధమైన విశాల మద్దతు కూడగట్టగలిగితేనే ఉద్యోగుల సిపిఎస్ రద్దు కల నెరవేరుతుంది. కాబట్టి ఉద్యోగులు, వారి సంఘాలు ఈ దిశగా ఆలోచించి ఆచరణకు పూనుకోవడం నేటి కర్తవ్యం. అందుకు సిపిఎం ఎప్పటికీ పోరాడుతుందని ఆ పార్టీ నేతలు హామీ ఇస్తున్నారు.

### గచ్చిబౌలి సిద్ధిక్‌నగర్‌లో ఒరిగిపోయిన భవనం

హైదరాబాద్,నగరంలోని గచ్చిబౌలి సిద్ధిక్‌నగర్‌లో ఒరిగిపోయిన భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేత చేటపట్టారు. చుట్టుపక్కల భవనాలకు ఎటువంటి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. హైడ్రా బాహుబలి జాక్ క్రషర్‌తో అధికారులు భవనాన్ని కూల్చివేస్తున్నారు.అయితే పక్కనే పెద్ద పెద్ద గుంతలు తీయడంతో ఈ భవనం గత రాత్రి ఒక్కసారిగా పక్కకు ఒరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భవనం పూర్తిగా డ్యామేజ్ అయినట్లు ఇంజనీరింగ్ నిపుణులు గుర్తించారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు రిపోర్టు ఇచ్చారు. ఈ నేపథ్యంలో భవనాన్ని కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే భవనంలో ఉన్నవారిని ఖాళీ చేయించి కూల్చివేతల పక్రియను మొదలుపెట్టారు. గతంలో బహదూర్‌పూరా, జీడిమెట్లలో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఐదు అంతస్థుల భవనం పక్కకు ఒరగడంతో జీహెచ్ఎంసీ టౌన్ఎ÷–లానింగ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు 50 గజాల్లో ఐదు అంతస్తుల్లో భవనం నిర్మించడంపై జీహెచ్ఎంసీ సీరియస్ అయ్యింది. 60శాతం పిల్లర్లు డ్యామేజ్ అయినట్లు ఇంజనీరింగ్ నిపుణులు గుర్తించారు. సెట్ బ్యాక్ లేకుండా పిల్లర్లు తవ్వడం వల్లే పక్కనే ఉన్న ఐదంతస్తుల భవనం ఒరిగినట్లు నిర్ధారించారు. అనుమతి లేకుండా సెల్లార్ తవ్విన యజమానిపై కేసు నమోదు చేశారు.కాగా.. బిల్డింగ్ ఒరిగిపోవడంపై భవన యజమాని స్వప్న మాట్లాడుతూ.. పక్కన కొత్త నిర్మాణం చేసేవాళ్ళు సరిగా పిల్లర్ గుంతలు తీయకపోవడంతో తమ బిల్డింగ్ కుంగిపోయిందన్నారు. అధికారులు మాత్రం తమ బిల్డింగ్ కూల్చుతామంటున్నారన్నారు. మాకు న్యాయం చేసిన తర్వాత మా బిల్డింగ్ కూల్చాలి. ఊర్లో ఉన్న ఆస్తులు అమ్ముకుని ఇక్కడ ఈ బిల్డింగ్ కట్టుకున్నాము. పక్కన కన్‌స్టక్షన్ వాళ్ళు చేసే తప్పు వల్ల మా బిల్డింగ్ కూలుస్తున్నారు' అంటూ స్వప్న ఆవేదన వ్యక్తం చేశారు. గత రాత్రి హైదరాబాద్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. గచ్చిబౌలిలోని సిద్ధిక్‌నగర్‌లో ఐదు అంతస్తుల భవనం ఉన్నట్టుండి పక్కకు ఒరిగిపోయింది. భవనాన్ని చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే భవనంలో ఉన్న వారికి సమాచారం ఇవ్వడంతో వారంతో భయంతో బయటకు పరుగులు తీశారు. ఒరిగిన బిల్డింగ్ పక్కనే ఇంకో నిర్మాణం చేపట్టగా.. పెద్ద పెద్ద గుంతలు తీయడం తో భవనం ఒక్కసారిగా పక్కకు ఒరిగినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని భవనాన్ని పరిశీలించారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బిల్డింగ్‌లో ఉన్న వారిని హుటాహుటిన ఖాళీ చేయించేశారు. భవనం ఒరిగిన విషయం తెలిసి చుట్టుపక్కల ప్రజలు అక్కడకు చేరుకున్నారు. అలాగే పలువురు ఒరిగిన భవాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ వార్త ఒక్కసారిగా వైరల్‌గా మారిపోయింది.

### ఉత్తర భారతంలో క్షీణిస్తున్న గాలిలో నాణ్యత

న్యూఢిల్లీ, దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రధాన నగరాల్లో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీ, యూపీ, నోయిడా, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో గాలి నాణ్యత సూచీ క్షీణించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 450కుపైనే నమోదవుతోంది. తీవ్ర వాయు కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కళ్ల మంటలు, తలనొప్పి వంటి పలు అనారోగ్య పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో పలు నగరాలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటున్నాయి. దేశంలోని దాదాపు తొమ్మిది నగరాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చాలా మంచి కేటగిరీలో ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. అతి తక్కువ కాలుష్య నగరాల జాబితాలో మిజోరాంలోని ఐజ్వాల్ తొలి స్థానంలో ఉంది. ఐజ్వాల్‌లో గాలి నాణ్యత సూచీ 26 వద్ద నమోదైంది. దీన్ని మంచి కేటగిరీ కింద భావిస్తారు. దీంతో అక్కడి నివాసితులు స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఐజ్వాల్ తర్వాత సిక్కింలోని గ్యాంగ్‌టక్, మేఘాలయాలోని షిల్లాంగ్ వరుసగా రెండు, మూడు స్థానాలో నిలిచాయి. ఈ నగరాల్లో ఏక్యూఐ లెవల్స్ వరుసగా 35, 36 వద్ద నమోదయ్యాయి. ఆ తర్వాత అస్సాంలోని గువాహటిలో 40, కర్ణాటకలోని చామరాజనగర్ 41, బాగల్‌కోట్‌లో 42, కేరళ త్రిస్సూర్‌లో 43, అరుణాచల్ ప్రదేశ్‌లోని నహర్లగన్‌లో 51, అస్సాం నాగాన్ నగరంలో ఏక్యూఐ లెవల్స్ 53తో సంతృప్తికరంగా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీ అత్యంత కాలుష్య నగరాల్లో తొలి స్థానంలో ఉంది. ఇక్కడ గాలి నాణ్యత సూచీ తీవ్రమైన కేటగిరీలో నమోదైంది.

# కాలుష్య నివారణకు చర్యలు చేపడతాం

అమరావతి, విశాఖపట్నంలో కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాసన మండలి సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. విశాఖ కాలుష్య నివారణకు, పరిశ్రమల నిర్వాహకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కాలుష్య నివారణ చేపడతాం. పలాస జీడిపప్పు తొక్క కాల్చడం ద్వారా కూడా పెద్ద ఎత్తున కాలుష్యం వెలువ డేది.. కానీ, ఇప్పుడు ఆ జీడిపప్పు తొక్క ద్వారా ఆయిల్ సేకరించి ఆదాయం సమకూర్చుతున్నామని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలలో కాలుష్యానికి కారణమయ్యే బొగ్గు వాడకాన్ని కూడా తగ్గిస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు.అయితే, కొన్ని దశాబ్దాలుగా పరిశ్రమల అభివృద్ధితో విశాఖలో కాలుష్యం పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రత్యేక ప్రణాళిక ద్వారా, విశాఖను కాలుష్యానికి దూరంగా ఉంచేలా ప్రయత్నిస్తాం అని అన్నారు. గత ప్రభుత్వం కాలుష్య నివారణకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అయితే, తమ ప్రభుత్వం గాలిలో నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. కాలుష్యం ఏ అభివృద్ధికి అయినా ఆటంకం కలిగిస్తోంది. కాలుష్యం లేని అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు

హైదరాబాద్, తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వం వెల్లడించింది సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ సర్కారు సన్నద్ధం చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టాన్ని ఆమోదించాలని చూస్తోంది. రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది.డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకోనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిసింది. అయితే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వినిపిస్తోంది. కానీ ఆలోపే మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు జరుగుతోందని కూడా సమాచారం అందుతోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పెన్షన్, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని పెంచేందుకు రేవంత్ సర్కారు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎలక్షన్స్‌కు ముందు పెన్షన్, రైతు భరోసాను పెంచితే ప్రభుత్వానికి మంచి పేరుతో పాటు పార్టీకి మైలేజీ వస్తుందని భావిస్తున్నారట. అసెంబ్లీ సమావేశాలు, పంచాయతీ ఎన్నికల మీద ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్.. అందుకు అనుగుణంగా కులగణను చేపట్టారు. మరోవైపు కొండపోచమ్మ సాగర్ దగ్గరలోని మాజీ మంత్రి హరీష్ రావు ఫామ్‌హౌస్‌పై విచారణ జరిపించాలని నిర్ణయించారు. గత పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం చేసిన అవినీతికి సంబంధించి అసెంబ్లీలో వాడీవేడీ చర్చకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

# ప్రిపేర్ అవుతోందా?

విజయవాడ:కలిసుంటే కలదు సుఖం. కూటమిగా ఉంటేనే బలం. ఉమ్మడిగా వెళ్తేనే విజయం అంటున్నారు సీఎం చంద్రబాబు. జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ కూడా ఇవే డైలాగ్స్ రిపీట్ చేస్తున్నారు. అటు కమలం లీడర్లు దోస్త్ మేరా దోస్త్ అంటున్నారు. 2014లో ఆ ముగ్గురి దోస్తీ స్టార్ట్ అయింది. 2019లో బ్రేక్ పడినా..2024కు వచ్చేసరికి పొలిటికల్ పిక్చర్ బద్దలు అయిపోయింది. అలాంటప్పుడు ఎవరిదారి వాళ్లు ఎందుకు చూసుకోవాలి. కలసి నడిస్తేనే కదా..అసలైన కిక్కు అంటున్నారు టీడీపీ, జనసేన, బీజేపీ ఫ్యూచర్ పొలిటిక్స్‌పై ఫుల్ క్లారిటీతో ఉన్నారు. అంతకముందు బీజేపీతో చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నప్పటికీ..2014లో ఫస్ట్ టైమ్ ఈ మూడు పార్టీలు కలసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. 2019లో విడిగా పోటీ చేసి ఓటమిని చవి చూశారు. 2024కు వచ్చేసరికి ఉమ్మడిగా బరిలోకి దిగి..నెవర్ బిఫోర్ పొలిటికల్ హిస్టరీ క్రియేట్ చేశారు. దాంతో ఇక వీడేది లేదు. ఒకరిని ఒకరు విడిచిపెట్టేది లేదు. ముగ్గురం ఒకటే. అందరి ఎజెండా అభివృద్ధే అంటూ నవ్యాంధ్ర ఫ్యూచర్ పొలిటిక్స్‌పైనా బాబు ఓ క్లారిటీకి వచ్చేశారు.

కూటమిలో ఎలాంటి సమస్యలూ లేవ్

కూటమి ఫ్యూచర్‌పై హస్తిన వేదికగా సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా అవుతున్నాయి. జమిలి ఎన్నికలు వచ్చినా..2029లో ఎలక్షన్స్ జరిగినా కలసే పోటీ చేస్తాం..ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమవుతున్నామంటూ బాబు చెప్పడం హాట్ టాపిక్ అవుతోంది. కూటమిలో ఎలాంటి సమస్యలు లేవని, కలిసి కట్టుగా ముందుకు సాగుతున్నామని..చంద్రబాబు స్పష్టం చేశారు. నరేంద్ర మోదీనే తమ నాయకుడని, ఆయన నేతృత్వంలోనే ముందుకు వెళ్తామని కూడా చెప్పారు.ఇక్కడే బాబు మార్క్ రాజకీయం, థర్టీ ఇయర్స్ పొలిటికల్ ఎక్స్‌పీరియన్స్ క్లియర్ కట్‌గా కనిపిస్తుంది. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలసి పోటీ చేసినా..టీడీపీకి అధికారానికి కావాల్సినన్నీ సీట్లు వచ్చాయి. 135 ఎమ్మెల్యేలు..16 ఎంపీలు గెలుచుకుంది టీడీపీ. అయినప్పటికీ అటు కేంద్రంలో ఉన్న బీజేపీతోనూ..రాష్ట్రంలో జనసేనతో సఖ్యతతోనే ఉంటున్నారు బాబు. అధికారంలోకి వచ్చాం..అవసరమైపోయిందని కాకుండా..కలసి నడిస్తే పార్టీలకు, ప్రజలకు జరిగే మేలేంటి తెలిసిన నాయకుడిగా బిహేవ్ చేస్తున్నారు.ఏపీలో టీడీపీ ఓటు బ్యాంకుకు ఎప్పుడూ ఢోకా లేదు. అయితే ప్రభుత్వంలో ఏ పార్టీపై అయినా అంతో ఇంతో ప్రజావ్యతిరేకత కామన్. డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండే ఆ ఓటు షేర్ మీదే పార్టీల గెలుపోటములు డిపెండ్ అయి ఉంటాయ్. అందుకే ఇప్పుడు బంపర్ మెజార్టీ, ఫుల్ లోడ్ స్ట్రెంథ్‌తో ఉన్నా..లాంగ్ లివ్ కూటమి అంటున్నారు బాబు. రాష్ట్రంలో జనసేన, బీజేపీ కంటే టీడీపీ ఓటు బ్యాంకే ఎక్కువ. ఆ పార్టీనే బూత్ స్థాయి వరకు చాలా స్ట్రాంగ్‌గా ఉంది.

దూరదృష్టికి ఎగ్జాంపుల్

అంత పటిష్ఠంగా ఉన్న పార్టీని లీడ్ చేస్తున్న అధినేతే కూటమి కంటిన్యూ అవుతుం దని చెప్పడం దూరదృష్టికి ఎగ్జాంపుల్‌గా చెప్తున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. ఒక్క రోజు కోసం కాదు..ఈ టర్మ్ కోసం అసలే కాదు..భవిష్యత్ ప్రణాళికతో బాబు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. బాబు టీడీపీకి సారథ్యం వహిం చినప్పటి నుంచి బీజేపీతోనే ఎక్కువసార్లు కలసి పోటీ చేశారు. 2014 నుంచి జనసేనతో దోస్తీ మొదలు పెట్టారు. క్యాస్ట్ ఈక్వేషన్లు, పార్టీ సిద్ధాంతాల పరంగా చూస్తే బీజేపీ, జనసేనకు ఏపీలో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకే ఉంది. అది తోడైతే విజయం ఈజీ అవుతుంది. ఇదే బాబు లాజిక్ అని పొలిటికల్ ఎనలిస్టులు చెప్తున్నారు.రాజకీయాలు అన్నప్పుడు పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు.

# కడప జిల్లాలో మొదలైన పవర్ పాలిట్రిక్స్

సెంట్రల్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని నౌకాశ్రయాలు.. విమానాశ్రయాలు.. పవర్ ప్రాజెక్టుల్లో సంపద సృష్టికర్త బిజినెస్ టైకూన్.. అదానీ పెట్టుబడుల జైత్రయాత్రపై కడప జిల్లాలో తిరుగుబాటు కలకలం రేపింది. పవర్ స్టోరేజీ ప్లాంట్ పనులకు ఎదురు దెబ్బ తగిలింది. స్థానికులకే ఉపాధి పేరిట జమ్మలమడుగు ఎమ్మెల్యే జగడానికి దిగారు. కంపెనీ సిబ్బందిని అడ్డుకున్నారు. ఒక రకంగా స్థానిక బలగాన్ని ప్రయోగించారు. బీజేపీ ఎంపీకి చెందిన కంపెనీకీ చుక్కలు చూపించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం పోలీసు కేసుల దశకు చేరింది. మరోవైపు ఇరుపక్షాల మధ్య సయోధ్య కోసం కూటమి పెద్దలు జోక్యం చేసుకున్నా. అయినా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఎక్కడా తగ్గేది లేదంటున్నారు. సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని మందలించినట్టు సమాచారం. అయినా ఆ ఎమ్మెల్యేలో ఎలాంటి మార్పు రాలేదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే భారత్‌లో పెట్టుబడుల కోసం ముడుపులు చెల్లించారని, ఈ రీతిలోనే కడప జిల్లా పవర్ ప్రాజెక్టును గత పాలకుల నుంచి సాధించారని అదానీపై అమెరికాలో కేసు నమోదు అయ్యింది. ఈ విషయం యావత్ భారతదేశాన్ని కుదిపేస్తోంది.



అసలు ఏం జరిగింది..

ఏపీలో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను నిర్మించేందుకు ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేసింది. ఈ ప్రాజెక్టు కింద 3700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. కడప జిల్లాతో పాటు శ్రీసత్యసాయి జిల్లాల్లో రెండు ప్లాంట్లను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. వీటి ఏర్పాటు కోసం దాదాపు 1490 ఎకరాలను లీజు ప్రాతిపదికన అందించటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూమి ఇచ్చిన రైతులకు ఎకరానికి ?30వేల చొప్పున లీజు చెల్లించటానికి ఒప్పందం కుదిరింది.ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షంగా దాదాపు పదివేల మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తామని అదానీ కంపెనీ స్పష్టం చేసింది. ఈ స్థితిలో జమ్మలమడుగు నియోజకవర్గంలో దొంతికోన వద్ద 307, 308, 309/2, 310, సర్వే నెంబర్లలో 470 ఎకరాల్లో 1800 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంటు నిర్మాణానికి అదానీ కంపెనీ సిద్ధపడింది. ఇందుకు ?5 వేల కోట్లు వెచ్చించనుంది. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులో హైడ్రో ఎలక్ట్రిక్ జనరేషన్ ప్లాంట్ ఇది. నీటి రూపంలో ఎనర్జీని స్టోర్ చేసి ఉంచుతుంది. మాజీ సీఎం జగన్? హయాంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.

తెర మీదకు ఉపాధి రగడ..

వైఎస్సార్ కడప జిల్లాలోని గండికోట ప్రాజెక్టు ఆధారంగా 1000 మెగావాట్ల సామర్థ్యంతో అదానీ గ్రూప్ హైడ్రో పవర్ (పంప్డ్ స్టోరేజీ) ప్రాజెక్టు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు కొండాపురం మండలం దుబ్బుడుపల్లి రాగికుంట, తిరుమల గ్రామాలతో పాటు మైలవరం మండలం బొగ్గులు పల్లి పరిధిలోని 400 ఎకరాల భూమిలో ప్రాజెక్టు పనులు చేపట్టాలని కంపెనీ నిర్ణయించింది. తొలి విడతగా ?1,800 కోట్లతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనుల సబ్ కాంట్రాక్టు టెండర్లను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ దక్కించుకుంది. క్షేత్రస్థాయిలో పనులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు వందల మంది వచ్చి ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. రిత్విక్ సంస్థ ప్రతినిధులతో వాగ్వివాదానికి దిగారు. ఎమ్మెల్యేను సంప్రదించకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. కాంట్రాక్టు పనులల్లో తమకు భాగం ఇవ్వాలని, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండు చేసినట్టు తెలుస్తోంది.

రాయలసీమలో మామూలే.. కమీషన్ల కోసం రాద్ధాంతం..

రాయలసీమలో పరిశ్రమ స్థాపన సందర్భంగా. కమీషన్లు, సబ్ కాంట్రాక్టుల, స్థానికులకు ఉద్యోగాల పేరుతో ఫ్యాక్టరీల యజమానులను స్థానిక రాజకీయ నేతలు, అనుచరులు ఒత్తిడి తీసుకురావటం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. గతంలో పెనుగొండలో కియా కారు లాంచ్ కార్యక్రమంలో అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహరించిన తీరుపై విమర్శలు వచ్చాయి. కియా ప్లాంట్ యాజమాన్యాన్ని ఇబ్బంది పెట్టేలా మాధవ్ వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి. కారు బానెట్ మీద నిరసన వ్యాఖ్యలు రాయడంతో పాటు మరొక సందర్భంలో 'కియా మెడలు వంచేస్తా' అని వ్యాఖ్యానించడంతో అప్పట్లో వివాదం రేగింది. ఆ తర్వాత తాను స్థానికులకు ఉద్యోగాల కోసమే కియాపై ఒత్తిడి చేశానని మాధవ్ వివరణ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అనంతపురం జిల్లా రాప్తాడులో ఏర్పాటు చేయాలనుకున్న జాకీ పరిశ్రమను అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి డబ్బులు డిమాండ్ చేయడంతో ఇక్కడి నుంచి వెళ్లిపోయిందని రెండేళ్ల కిందట సీపీఐ నేతలు ఆరోపించారు. ఈ ఆరోపణలను అప్పట్లోనే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అది సరైన కంపెనీ కాదని ట్రాక్ రికార్డు లేని ఆ కంపెనీకి చంద్రబాబు ప్రభుత్వం 2014- ..19 మధ్య నామమాత్రపు ధరకు భూములు కట్టబెట్టిందని, అయినప్పటికీ ఆ కంపెనీ రావడం లేదని విమర్శించారు.

బీజేపీ ప్రోత్సహించదు.. సీరియస్‌గా తీసుకుంటాం

"జరిగిన ఘటన అవాంఛవీయం. భారతీయ జవతా పార్టీ ఇలాంటి వాటిని అస్సలు ప్రోత్సహించదు. అందులోనూ.. ఇది మా పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులకు సంబంధించిన విషయం. కచ్చితంగా బీజేపీ పెద్దలు జోక్యం చేసుకుంటారు. అధిష్టానం జాతీయ స్థాయిలో వాస్తవాలను విచారిస్తుంది. ఇది పార్టీ అంతర్గత అంశం. దీని గురించి ఇంతకంటే మేం బహిరంగంగా మాట్లాడలేం" అని రాయలసీమకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అన్నారు. "ఏదేమైనా ఇలాంటివి పార్టీకి మంచిది కాదు. పరిశ్రమలకు సంబంధించిన అంశంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రభావం చూపిస్తుంది. మామూలుగానే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు పెట్టాలంటే గత పరిస్థితుల దృష్ట్యా కంపెనీలు భయపడుతున్నాయి. ఈ సమయంలో ఇలాంటివి చోటుచేసుకుంటే రాష్ట్రానికే నష్టం జరుగుతుంది.." అని ఆయన వ్యాఖ్యానించారు.

అదానీ మెడకు అమెరికా కేసు ఉచ్చు..

న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో భారతీయ బిజినెస్ టైకూన్ గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై మోసం, లంచం ఆరోపణలపై కేసు నమోదైంది. యునైటెడ్ స్టేట్స్ అటార్నీ కార్యాలయం వివరణ ప్రకారం, భారతదేశంలో సౌరశక్తి ప్రాజెక్టులను పొందేందుకు భారతీయ అధికారులకు, అమెరికాలో నిధుల సమీకరణకు 25 కోట్ల డాలర్లు (దాదాపు ? 2,100 కోట్లు) లంచంగా ఇవ్వజూపారని, ఆ విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టారని అదానీపై అభియోగాలు నమోదయ్యాయి. నౌకాశ్రయాలు, విమానాశ్రయాల నుంచి పునరుత్పాదక ఇంధన రంగాల (రెన్యూవబుల్ ఎనర్జీ) వరకూ వ్యాపారాలను విస్తరింప జేసిన అదానీపై న్యూయార్క్‌లో బుధవారం నేరారోపణలు నమోదయ్యాయి. వచ్చే 20 ఏళ్లలో 200 కోట్ల డాలర్లు (? 16,880 కోట్లు ) కంటే ఎక్కువ ఆదాయం తెస్తాయని అంచనాలు ఉన్న కాంట్రాక్టులను దక్కించుకోవడానికి.. అదానీ, ఆయన కంపెనీల్లోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు భారత అధికారులకు చెల్లింపులు చేయడానికి అంగీకరించారని యూఎస్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

అరెస్ట్ వారెంట్లు

అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ అధికారులు, అదానీ సన్నిహితులు సాగర్, వినీత్ జైన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో గౌతమ్, సాగర్ అదానీలపై అరెస్ట్ వారెంట్లు కూడా జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. గౌతమ్ అదానీ, సాగర్ ఆర్. అదానీ, వినీత్ ఎస్. జైన్, రంజిత్ గుప్తా, రూపేష్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా, సౌరభ్ అగర్వాల్, సిరిల్ కాబనేజ్‌లపై ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ అంశంపై అదానీ గ్రూప్ కంపెనీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

యూఎస్ అటార్నీ వివరణ

బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చేందుకు నిందితులు రహస్య పథకం పన్నారని అమెరికా అటార్నీ బ్రియాన్ పీస్ అభియోగాల్లో పేర్కొన్నారు. దీని కోసం చాలా మందిని చీకటిలో ఉంచారని ప్రస్తావించారు. అమెరికన్లతోపాటు ప్రపంచ పెట్టుబడిదారుల నుంచి నిధులను సేకరించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్ నుంచి అవినీతిని రూపుమాపేందుకు కట్టుబడి ఉండాలని హెచ్చరించారు.

ఏపీ సోలార్ ప్లాంటులకూ లింకు..

ఇప్పుడు అమెరికా ఫెడరల్ కోర్ట్ లో నడుస్తున్న.. అదానీ ఆర్థిక నేరాల కేసుతో ఆంధ్రాలో నేతలకూ లింకు బయటపడింది. ఈ మేరకు మీడియాలో కథనాలు తెరమీదకు వచ్చాయి. ఏపీలో 2019 మే 2024 జూన్ వరకు హైర్యాంక్ లో ఉన్న ఒకరితో ఈ డీల్ కుదిరిందని, అదానీ నేరుగా వచ్చి అతనిని 2021 సెప్టెంబర్ 12 కలిసినట్టు తెలుస్తోంది. దాదాపు ?1750 కోట్లు ఆఫర్ చేసినట్టు సమాచారం. ఆతర్వాత నాలుగు రోజులకి 2021 సెప్టెంబర్ 16న మంత్రివర్గ సమావేశంలో సౌరవిద్యుత్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సౌరవిద్యుత్ టెండర్లని అప్పటి సీఎం జగనే రద్దు చేశారు. ఆతర్వాత కొన్ని నెలలకి అదానికి ఏపీలో సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కినట్టు ప్రచారం జరుగుతోంది.

వారిద్దరి స్కామ్‌లే.. జేపీసీకి కాంగ్రెస్ డిమాండ్

అదానీ గ్రూప్ ఆర్థిక లావాదేవీలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్? నేత జై రాం రమేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాల్లో పెరుగుతున్న గుత్తాధిపత్యానికి దారి తీస్తోందని, ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తోందన్నారు. గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ నేరారోపణల నేపథ్యంలో 'మోదానీ' స్కామ్‌లపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరపాలన్నారు.

# కోచింగ్ లేకుండానే .. కొలువులు కొట్టారు




సిరిసిల్ల,"చిరిగిన చొక్కా అయిన తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో" అంటారు కందుకూరి వీరేశలింగం పంతులు. చదివే ఆసక్తి ఉన్న కొనే ఆర్థిక పరిస్థితి లేని వారికి గ్రంథాలయలూ అమ్మ ఒడిలాంటివి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఎంతోమంది నిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా తయారుచేసి ఎందరికో స్ఫూర్తిని అందిస్తుంది. పోటీ- పరీక్షల్లో నిలబెట్టి విద్యార్థులకు విజయాలకు అందిస్తుంది. ఇటీవల జరిగిన పోటీ- పరీక్షల్లో జిల్లా గ్రంథాలయంలో పోటీ-పడి చదివి రాణిస్తున్న విద్యార్థులు ఎందరికొ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. అలాంటి వారిపై ఆంధ్రప్రభ ప్రత్యేక కథనం..

పోటీ పరీక్షల్లో సత్తా చాటుతున్నారు..

ఇటీవల జరుగుతున్న పోటీ పరీక్షల్లో జిల్లా గ్రంథాలయ రీడర్లుగా పలువురు విద్యార్థులు పోటీ పరీక్షలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. గతంలో పోలీసుల ఎంపిక కోసం జరిగిన పోటీ పరీక్షల్లో పలువురు గ్రంథాలయంలో చదువుకొని విజయాలను సాధించి ఉద్యోగులుగా విధుల్లో కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో సుమారు 60 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు పోటీ పరీక్షలు రాసి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విజయాలను సాధించిన పరిస్థితి కనిపిస్తుంది. కేవలం గ్రంథాలయంలోని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు పోటీ పరీక్షల్లో తమకు ఎంతో సహాయకారిగా నిలిచాయని ప్రభుత్వ ఉద్యోగులుగా మలచడంలో గ్రంథాలయం ఎంతో తోడ్పడినట్లు ఉద్యోగాలు విజయం సాధించిన విద్యార్థులు తెలుపుతున్నారు. తమ కృషికి తోడుగా గ్రంథాలయం నిలబడిందని తెలుపుతున్నారు. పలువురు చదువరులు %\'%రీడర్స్ క్లబ్?గా ఏర్పడి ఎప్పటికప్పుడు తమ అభిప్రాయం పంచుకుంటూ ముందుకు సాగుతున్నారు.

కోచింగ్ సెంటర్లకు వెళ్లే పరిస్థితి లేదు..

డబ్బులు వెచ్చించి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే పరిస్థితి లేదు. తమ కుటుంబాలకు ఆర్థికంగా భారం కాలేక గ్రంథాలయంలో రీడర్‌గా పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యారు. పట్టుదలతో ప్రయత్నించి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉ ద్యోగులయ్యారు. రికార్డు స్థాయిలో జిల్లా గ్రంథాలయంలో చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కొందరు విద్యార్థులు రెండు ఉద్యోగాలు పొందిన సందర్భాలున్నాయి. ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ.. విద్యార్థులను తీర్చి దిద్దుతున్న గ్రంథాలయ సిబ్బంది తీరు అభినందనీయమని పలువురు కొనియాడుతున్నారు. ఈ గ్రంథాలయం జిల్లాలోనే కాకుండా రాష్ట్ర సరిహద్దులు దాటి ఎందరో విద్యార్థులకు స్ఫూర్తినిచ్చి బతుకు 'దారి' చూపుతుందని ఆశిద్దాం.

# రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

సంగారెడ్డి, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డితెరలేపుతున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని సీఎం చేసిన తప్పుడు ఆరోపణలపై ఘాటుగా స్పందించారు.గురువారం అందోల్ మండలం మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని నాపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేశాడు.పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర నీదని ధ్వజమెత్తారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా13 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదని స్పష్టం చేశారు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే ఉన్నాను.నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు రేవంత్ రెడ్డి.. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం. నువ్వు ఎన్ని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రైతుల పక్షాన నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగాడా అని ప్రశ్నించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో సైతం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మరోపక్క సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రకటించారు. దీని ఆంతర్యమేమిటని నిలదీశారు. మధ్యలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడికి పోయిందో చెప్పాలన్నారు. రైతులు పండించిన ధాన్యంలో సగం దళారుల పాలయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..దళిత, గిరిజన, అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతున్నది. కంపెనీ నిర్మాణాల కోసం ఆ భూములను తన ఆప్తులకు కట్టబెట్టే ప్రయత్నం సీఎం చేస్తున్నాడు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

# తెలంగాణ ఉద్యమంలో దీక్షా దివస్ కీలకం

హైదరాబాద్, తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్ష దివాస్ నిలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్ష దివాస్‌ను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో జరిగే దీక్షా దివాస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొననున్నారు. 2009, నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలి దశ ఉద్యమం ఉ వ్వెత్తున ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదలు వేసిందని కేటీఆర్ తెలిపారు. దీక్షకు వెళ్లే ముందు తెలంగాణ వచ్చుడో ? కేసీఆర్ సచ్చుడో అనే తెగింపుతో చేపట్టిన ఈ దీక్ష సబ్బండవర్ణాల తెలంగాణ ప్రజలను ఏకం చేసిందని పేర్కొన్నారు. ఈ దీక్ష యావత్ భారత దేశ రాజకీయ వ్యవస్థను కదిలించి, చరిత్రలో తొలిసారి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసి దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# మళ్లీ విచారణ...

హైదరాబాద్,తెలంగాణ గట్టు మీద అరెస్టుల అంశం హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారంటూ ఊహాగానాలు, వార్తలు, గాసిప్‌లు చక్కర్లు కొడుతోంది. నెల రోజులుగా ఆ ఎపిసోడ్ కంటిన్యూ అవుతోంది. ఇంతలోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ హీట్ క్రియేట్ చేస్తోంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌విచారణను స్పీడప్ చేసింది.ఆరోపణలు, అక్రమాలకు సంబంధించి ఇప్పటికే పలువురు అధికారులను విచారించింది కమిషన్. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలపై విచారణ జరిపేందుకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ నెల 21న మరోసారి హైదరాబాద్‌కు రాబోతుందట. వచ్చే నెల 5 వరకు ఇక్కడే ఉండి పలువురిని విచారించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పీసీ ఘోష్ కమిషన్..మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

హరీశ్ రావును కూడా విచారణకు పిలుస్తారా?

మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు అప్పుడు ఇరిగేషన్ మినిస్టర్‌గా పనిచేసిన హరీశ్ రావును కూడా విచారణకు పిలుస్తారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ కొనుగోళ్ల ఇష్యూలోనే కేసీఆర్‌ను ఇరికించే ప్రయత్నం జరిగింది. అప్పుడు విద్యుత్ కమిషన్ నోటీసులు ఇస్తే మాజీ సీఎం విచారణకు హాజరుకాలేదు. అంతేకాదు జస్టిస్‌నరసింహారెడ్డి కమిషన్‌కు విచారణార్హత లేదంటూ లేఖ రాశారు. న్యాయసూత్రాలకు విరుద్ధంగా కమిషన్‌ఏర్పాటైందని..అలాంటి కమిషన్‌ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు కేసీఆర్. దాంతో ఏకంగా విచారణ కమిషన్ చైర్మన్ నే మార్చాల్సి వచ్చింది సర్కార్ కు. మరి ఇప్పుడు కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్‌ను విచారణ పిలిస్తే వెళ్తారా.? కేసీఆర్ విచారణకు హాజరుకాకపోతే కమిషన్ ఎలా ముందుకు వెళ్తుందనేది ఉత్కంఠ రేపుతోంది.కాళేశ్వరం విచారణ కమిషన్ నుంచి..ఈ నెలాఖరున కేసీఆర్‌కు పిలుపు రాబోతుందన్న ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ విచారణకు వెళ్లకపోతే అరెస్ట్ చేస్తారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ అంత డేర్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తామని హంగామా చేసిన కాంగ్రెస్‌ఇప్పటికే డైలమాలో పడింది. లగచర్ల ఘటనలో కేటీఆర్ అరెస్ట్‌పై బ్యాక్ స్టెప్ వేసినా కాంగ్రెస్ పెద్దలు..ఫార్ములా ఈ రేస్ కేసులో గవర్నర్ అనుమతి రాగానే ఆయన్ను జైలుకు పంపుతామంటున్నారు. ఇంతలోనే కాళేశ్వరం విషయంలో కేసీఆర్ కార్నర్ చేసే ప్రయత్నం జరుగుతోంది.

లేఖ రాసి దూరంగా ఉంటారా?

అయితే విచారణకు కేసీఆర్‌హాజరవుతారా? లేక జస్టిస్‌ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు లేఖ రాసినట్లుగా..జస్టిస్‌పీసీ ఘోష్‌కు లేఖ రాసి దూరంగా ఉంటారా? అన్న చర్చ సాగుతోంది. జస్టిస్‌ఎల్.నర్సింహారెడ్డి స్థానంలో నియమితులైన జస్టిస్‌మదన్‌భీంరావు లోకూర్‌కమిషన్‌మాత్రం కేసీఆర్‌ను విచారణకు పిలవకుండానే నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

# గ్లోబల్ వాయిస్ విషయంలో నరేంద్రమోదీనే టాప్



న్యూఢిల్లీ,విదేశాంగ విధానం అంటే సాధారణ ప్రజలకు సంబంధం లేదనే భావన చాలా మందిలో ఉంటుంది. కాని మోదీ ప్రధానిగా ఉన్న ఈ పదేళ్ల కాలంలో ఆ భావన తొలగిపోయింది. విదేశాంగ విధానపరంగా మోదీ సర్కారు తీసుకున్న చొరవలు అంతర్జాతీయంగా భారత్ స్థాయి పెంచడంతో పాటు భద్రత, ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేశాయనే చెప్పాలి.. ముఖ్యంగా మోదీ సర్కారు అనుసరిస్తున్న విదేశాంగ విధానం – ప్రపంచ దేశాల్లో భారత ఖ్యాతి మార్మోగేలా చేస్తోంది. విదేశాంగ విధానం అంటే సాధారణ ప్రజలకు సంబంధం లేదనే భావన చాలా మందిలో ఉంటుంది. కాని మోదీ ప్రధానిగా ఉన్న ఈ పదేళ్ల కాలంలో ఆ భావన తొలగిపోయింది. విదేశాంగ విధానపరంగా మోదీ సర్కారు తీసుకున్న చొరవలు అంతర్జాతీయంగా భారత్ స్థాయిని పెంచడంతో పాటు భద్రత, ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేశాయనే చెప్పాలి.. ముఖ్యంగా మోదీ సర్కారు అనుసరిస్తున్న విదేశాంగ విధానం ప్రపంచ దేశాల్లో భారత ఖ్యాతి మార్మోగేలా చేస్తోంది. మోదీ సర్కారు ప్రస్థానంలో దానికి సంబంధించిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. అది జీ20 అయినా.. కాప్ 19, జీ7 ఇలా ఏ వేదికైనా భారత్ విధానాలను స్పష్టంచేయడంతోపాటు.. అనేక విషయాలపై ప్రధాని మోదీ క్లారిటీ ఇస్తారు.. అందుకే.. ప్రపంచ దేశాల్లో భారత్ క్రేజ్ విపరీతంగా పెరిగిందని చెప్పవచ్చు.రాష్ట్రానికి, దేశానికి అత్యున్నత రాజ్యాంగ పదవుల్ని నిర్వహించిన మోదీ పాలన తనకంటూ ఓ ప్రత్యేకతను, గుర్తింపును పొందారు.. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో తన మార్క్ ను పదిలంగా ఉండిపోయేలా చేశారు.. వేదిక ఏదైనా సరే తన వాగ్దాటితో అందరినీ ఆకట్టుకుంటారు.. భారత్ లక్ష్యాలను సాధించడం కోసం ఎల్లప్పుడూ స్పష్టమైన విధానాలతో ముందుకు సాగుతారు.. అది దౌత్యం అయినా.. వార్నింగ్ అయినా.. ఆయన స్టైలే వేరు.. మూడో సారి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నరేంద్రమోదీ.. ప్రపంచంలోనే కీలక నేతల్లో ఆయన ఒకరిగా నిలిచిపోయారు.. అంతేకాకుండా.. మోదీ వాయిస్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోంది.. అంతేకాకుండా.. పలు దేశాలు సైతం తమ దేశంలో పర్యటించాలని ఆహ్వానాలు అందుకున్న కీలక నేతల్లో మోదీ ఒకరు.. భారత్ వాయిస్ ను గ్లోబల్ చేసిన ఘనత మోదీకే దక్కుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పవచ్చు.. అయితే.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి విదేశాల్లో అత్యధిక ప్రసంగాలు చేసిన ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మరో ఘనతను సాధించారు.. తన గయానా పర్యటన సందర్భంగా, ప్రధాని నరేంద్ర మోదీ నవంబర్ 21న గయానీస్ పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు.. ఇది తన ప్రపంచ దౌత్య రంగంలో మరో ముఖ్యమైన ఘట్టాన్ని సూచిస్తుంది. విదేశీ దేశాల పార్లమెంటులలో భారత ప్రజల తరపున ప్రధాని మోదీ ప్రసంగించడం ఇది 14వ సందర్భం.. విదేశీ పార్లమెంటులను ఉద్దేశించి అత్యధిక ప్రసంగాలు చేసిన భారత ప్రధానిగా నరేంద్రమోదీ మరో చరిత్రను లిఖించారు. విదేశీ పార్లమెంటులను ఉద్దేశించి ఆయన చేసిన 14 ప్రసంగాలు మన్మోహన్ సింగ్ చేసిన ప్రసంగాల సంఖ్య కంటే రెట్టింపు.. మన్మోహన్ సింగ్ 7 ప్రసంగాలు మాత్రమే చేశారు. ఇందిరాగాంధీ నాలుగుసార్లు విదేశీ చట్టసభల్లో ప్రసంగించగా, జవహర్‌లాల్ నెహ్రూ మూడుసార్లు ప్రసంగించారు. రాజీవ్ గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ఇలా రెండు ప్రసంగాలు చేయగా, మొరార్జీ దేశాయ్, పివి నర్సింహారావు వంటి వారు ఒక్కసారి మాత్రమే ప్రసంగించారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. సంవత్సరాలుగా, ప్రధాని మోదీ అమెరికా నుంచి యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఆసియా వరకు ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత సభలలో ప్రసంగాలు చేశారు. ఖండాంతరాలు దాటిన అతని ప్రసంగాలు.. ప్రపంచ వేదికపై భారతదేశ గుర్తింపు పెరుగుతుందనడానికి నిదర్శనం..

# 3 దశాబ్దాల తర్వాత అత్యధిక పోలింగ్ శాతం నమోదు.. దేనికి సంకేతం?

మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సహా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు ముగిశాయి. ఈనెల 23న వాటి ఫలితాలు వెల్లడి కానున్నాయి. అన్నింటిలో మహారాష్ట్ర ఎన్నికలనే యావద్దేశం ఆసక్తిగా గమనిస్తోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబై మహా నగరం ఈ రాష్ట్రంలోనే ఉండడం ఒకెత్తయితే, ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత అత్యధిక జనాభా, పార్లమెంట్ స్థానాలు కల్గిన రాష్ట్రం కూడా ఇదే కావడం మరో ఎత్తు. పైగా కొద్ది నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రాల్లోనే అధికార భారతీయ జనతా పార్టీ కి ఎదురుదెబ్బ తలిగింది. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ కోల్పోయి మిత్రపక్షాలతో కలిపి "నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్" ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మొత్తం 48 పార్లమెంట్ స్థానాల్లో విపక్ష ఇండి కూటమి 30 స్థానాలు గెలుచుకోగా, ఎన్డీఏ కూటమి కేవలం 17 స్థానాలకే పరిమితమైంది. కొద్ది నెలల వ్యవధిలోనే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ఓటరు నాడి ఎలా ఉందన్నదే ఇప్పుడు అందరికీ ఉత్కంఠ రేకెత్తిస్తోంది.



### పెరిగిన పోలింగ్ శాతంపై విశ్లేషణలు

ఎన్నికలు ముగిశాయో లేదో ఎగ్జిట్ పోల్ అంచనాలు అంటూ విశ్లేషణలు మొదలవుతాయి. మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలపై కూడా అనేక సర్వే సంస్థలు తమ అంచనాలు విడుదల చేశాయి. వాటిలో ఒకట్రెండు తప్ప దాదాపు అన్నీ బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ (మహాయుతి) గెలుపొందుతుందని వెల్లడించాయి. ఏ విశ్లేషణకైనా గణాంకాలు కీలకం. అందులో పోలింగ్ శాతం ఒకటి. గత ఎన్నికల కంటే ఎక్కువగా నమోదైతే.. దాన్ని సాధారణంగా ప్రభుత్వ వ్యతిరేకతగా విశ్లేషిస్తూ ఉంటారు. కొన్ని సందర్భాల్లో ఈ విశ్లేషణలు తప్పు అని రుజువయ్యాయి. మరి మహారాష్ట్రలో ఈసారి నమోదైన పోలింగ్ శాతం గతం కంటే స్వల్పంగా ఎక్కువగా ఉంది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 61.44 శాతం పోలింగ్ నమోదవగా.. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అది 65.02గా నమోదైనట్టు కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పెరిగిన ఓట్ల శాతం ఎవరి విజయావకాశాలను ఎలా ప్రభావితం చేస్తుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది.మహారాష్ట్రలో 1995లో నమోదైన 71.7 శాతం ఓట్లే గత మూడు దశాబ్దాల్లో అత్యధిక పోలింగ్ శాతం. మళ్లీ 30 ఏళ్ల తర్వాత భారీ పోలింగ్ శాతం నమోదైంది. బాలీవుడ్ సినీ పరిశ్రమకు కేంద్ర బిందువుగా ఉన్న ముంబైలో సినీ ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు తరలివచ్చి ఓటు వేయడంతో పాటు మిగతావారికి స్ఫూర్తినిచ్చారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యానికి తావు లేకుండా కేంద్ర ఎన్నికల సంఘం చేసిన ఏర్పాట్లు కూడా పోలింగ్ శాతం స్వల్పంగా పెరగడానికి దోహదపడ్డాయని భావిస్తున్నారు.ప్రాంతాలవారిగా చూస్తే రాష్ట్రంలోని 36 జిల్లాల్లో కొల్హాపూర్ జిల్లాలో అత్యధికంగా 76.25 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాతి స్థానంలో మావోయిస్టుల ప్రాబల్య గడ్చిరోలి (73.68%) నిలవగా, 72.30 శాతంతో జాల్నా 3వ స్థానంలో నిలిచింది. ముంబై మహానగరంలో అత్యల్పంగా 52.07 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గాలవారిగా చూస్తే ముంబైలోని కొలాబా నియోజకవర్గం 44.49 శాతంతో అత్యల్పంగా నిలిచింది. సహజంగానే పట్టణ ప్రాంత ప్రజలు ఓటు వేయడానికి నిరాసక్తి ప్రదర్శిస్తూ ఉంటారు. ఈ రాష్ట్రంలో పట్టణ జనాభా అధికం. దాదాపు 5.1 కోట్ల మంది అంటే జనాభాలో 45 శాతం పట్టణ ప్రాంతాల్లో నివసి స్తోం ది.

### విశ్లేషణకు అందని రెండు పార్టీల్లో చీలికలు

మహారాష్ట్రలో ఐదేళ్ల కాలంలో రాజకీయంగా అనేక కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పారీలు రెండుగా చీలిపోయాయి. శివసేనలో చీలిక వర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వం వహిస్తుంటే, మరోవర్గానికి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వం వహిస్తున్నారు. ఉద్ధవ్ కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడలో ఉండగా, ఏక్‌నాథ్ షిండే 'మహాయుతి' లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్సీపీలో శరద్ పవార్ వర్గం కాంగ్రెస్‌తో కలిసి సాగుతుండగా, అజిత్ పవార్ వర్గం ఎన్డీఏలో భాగంగా ఉంది. చీలిక పార్టీలే అసలైన పార్టీలని, పార్టీ ఎన్నికల గుర్తులు వారికే చెందుతాయని కేంద్ర ఎన్నికల సంఘం చెప్పడంతో ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లు ఎన్నికల గుర్తు విషయంలో ఇబ్బందులు ఎదుర్కోలేదు. గుర్తులు మారకపోయినా సరే.. లోక్‌సభ ఎన్నికల్లో ఆశించినన్ని స్థానాలు గెలుపొందలేకపోయారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు చీలిక వర్గాల ప్రభావం ఎంతమేర ఉంటుందన్నది ఎవరి ఊహకు అందడం లేదు.

# తిరుమల క్షేత్రం కోసం ఆధ్యాత్మిక ప్రణాళిక వ్యవస్థ

తిరుపతి: తిరుమల దివ్య క్షేత్ర పవిత్రతను పరిరక్షించే కోణంలో ఆధ్యాత్మికతను ప్రతిబింబించే సమగ్ర ప్రణాళిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణాధికారి శ్యామల రావు ప్రకటించారు. గురువారం సాయంత్రం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ%% ఆ వ్యవస్థ అయిదేళ్ల క్రితం నాటి తిరుమల అభివృద్ధి ప్రణాళిక ప్రతిపాదనకు ఆధునిక రూపంలో ఉంటుందని చెప్పారు. తిరుమల విషయంలో తొలి నుంచి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన తరువాత పర్యవేక్షించే విధానం కొరతగా ఉందని గుర్తించామన్నారు. అందుకే నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో కొన్ని నిర్మాణాలు జరిగేందుకు వీలు కలిగినట్టు స్పష్టమైందన్నారు.మరోవైపు భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా నిర్మాణాత్మకమైన ప్రణాళిక లేకుండా పోయిందన్నారు. 2019లో తిరుపతి అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా చేసిన ప్రయత్నంలో లీ అసోసియేట్ అనే ప్రైవేట్ కన్సల్టెన్సీ ద్వారా తిరుమల కోసం ఒక మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కృషి జరిగిందన్నారు. అయితే ఆ ప్లాన్ గురించి సరైన సమాచారం లేకపోవడంతో ఆనాటి కన్సల్టెన్సీ వారితో సంప్రదించి కొన్ని వివరాలను సేకరించినట్టు తెలిపారు. అందులో చాలావరకు 2017నాటి పరిస్థితులు ప్రతిబింభించే విధంగానే అంశాలు ఉన్నాయన్నారు. కనుక ఆ ప్లాన్ కు ఇప్పటి పరిస్థితికి, వచ్చే 25ఏళ్ల అవసరాలకు తగినవిధంగా ఆధునీకరించి పునర్నిర్మించాలని ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించిందని తెలిపారు.ఆ నిర్ణయానికి అనుగుణంగా తిరుమల క్షేత్రాన్ని ఆధ్యాత్మికత కోణంలో భావి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేయడానికి సన్నాహాలు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం సంబంధిత రంగంలో నిపుణులైన ఒక సీనియర్ అధికారిని ఎంపిక చేశామని ఆయన ఆధ్వర్యంలో అర్బన్ డెవలప్ మెంట్ ప్లానింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. రాబోయే రెండునెలల్లో ఆ వ్యవస్థ ద్వారా ఒక విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకుని బోర్డులో చర్చించి అమలు చేస్తామని తెలిపారు. మరో ఆరు నెలల్లో ఆ డాక్యుమెంట్ అమలుకు



తెచ్చే ముందు, దానిలోని అంశాలపై సమగ్ర అధ్యయనం, సంబంధిత వర్గాలతో సమీక్ష, అభిప్రాయ సేకరణ వంటి చర్యలు ఉంటాయని చెప్పారు. ఇష్టం వచ్చినట్టు చేపట్టిన మఠాల నిర్మాణాలపై చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. ఇంకా మౌలికంగా తిరుమలలో పార్కింగ్ సమస్య, బాలాజీ బస్టాండ్ తరలింపు, వ్యక్తుల పేర్లతో ఉన్న అతిథి గృహాల పేర్ల మార్పు, మఠాల, అతిథి గృహాల నిర్మాణాల, పరిధుల పున: సమీక్ష, ప్రత్యేక చెత్త నిర్వహణ వ్యవస్థ నిర్మాణం వంటి అంశాలు ఉంటాయని తెలిపారు. చేపట్టిన, చేపట్టే నిర్మాణాలు ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

### అలిపిరి వద్ద ట్రాన్సిట్ వ్యవస్థ ఏర్పాటుకు అధ్యయనం

అలాగే తిరుమల క్షేత్రం 11మైళ్ళ చదరపు విస్తీర్ణం కలిగి ఉన్నా 1.16 చదరపు మైళ్ళ పరిధి మాత్రమే వినియోగంలో ఉందన్నారు. కనుక పెరిగే భక్తులకు పూర్తి స్థాయిలో అన్ని వసతి సౌకర్యాలు కష్టతరం అవుతోందన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోని అలిపిరి వద్ద భక్తులకు తాత్కాలిక వసతి వ్యవస్థను ఏర్పాటు చేసి సమయానికి దర్శనానికి తిరుమలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలనే అంశం పై అధ్యయనం చేయనున్నట్టు కూడా శ్యామలరావు తెలిపారు.

# మరో వివాదంలో ఆదానీ గ్రూపు..



న్యూయార్క్,ఆదానీ గ్రూపు మరో వివాదంలో ఇరుక్కుంది. అదికూడా లంచం కేసు కావడం విశేషం. భారత బిలియనీర్, అదానీ గ్రూప్ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీపై లంచం కేసు నమోద య్యింది. ఈ మేరకు అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడమే గాక.. దాని గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి వారి నుంచి నిధుల సేకరణకు పాల్పడినట్లు న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. దీంతో గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.అదానీ, దాని అనుబంధ సంస్థలు 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభం పొందగల సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 265 మిలియన్ డాలర్లు లంచాలు ఆఫర్ చేసినట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అనంతరం అమెరికా, అంతర్జాతీయ మదుపర్లకు తప్పుడు సమాచారం తెలియజేసి నిధులు సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించినట్లు పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా.. ఆ కంపెనీ రుణ దాతలు, పెట్టుబడిదారుల నుంచి 3 బిలియన్ డాలర్లకు పైగా రుణాలు, బాండ్లను సేకరించిందని ఆరోపిస్తూ న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు. ఇదే సమయంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకు పైగా సమీకరించిందని అందులో ఆరోపించింది. దీనిపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది. అయితే తమపై వచ్చిన ఆరోపణలపై అదానీ గ్రూప్ స్పందించింది. సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి లంచం ఇవ్వజూపారంటూ వచ్చిన అభియోగాలను తోసిపుచ్చింది. అదానీ గ్రూపుపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కొట్టి పారేసింది. చట్టాలకు లోబడి తమ గ్రూపు నడుచుకుంటోందని వివరణ ఇచ్చింది. న్యాయపరంగా ముందుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నా మని పేర్కొంది. సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడంలో భాగంగా అదానీ గ్రూపు రూ.2,100 కోట్లు భారత అధికారులకు లంచం ఇవ్వజూపిందన్న ఆరోపణలతో పాటు, దాని గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. గౌతమ్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదైనట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అదానీ గ్రూపు స్టాక్స్ భారీగా పడ్డాయి. ఈ వ్యవహారం రాజకీయంగానూ దుమారం రేపింది. దీంతో కాంగ్రెస్, భాజపాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. అదానీ గ్రూపుపై పెద్దఎత్తున ఆరోపణలు రావడంపై ఆ గ్రూపు స్పందించింది. అవి కేవలం నేరారోపణలు మాత్రమేనని అదానీ గ్రూపు ప్రతినిధి పేర్కొన్నారు. దోషులుగా రుజువయ్యే వరకు నిందితులను నిర్దోషులుగానే భావించాల్సి ఉంటుందన్నారు. పాలనా వ్యవహారాల్లో, పారదర్శకత విషయంలో అదానీ గ్రూపు ఎప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటిస్తుందన్నారు. తాము కార్యకలాపాలు నిర్వహించే ప్రతిచోటా వీటిని పాటిస్తూ వస్తున్నామన్నారు. చట్టాలను గౌరవిస్తూ, వాటికి లోబడి నడుచుకుంటున్నందున వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదానీ గ్రూపు ఓ ప్రకటనలో పేర్కొంది.

# పాక్‌లో ఉగ్రవాదుల బీభత్సం..



లోయర్ కుర్రం,పాకిస్తాన్‌లోని లోయర్ కుర్రంలో ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. ప్రయాణికులతో ఉన్న వాహనంపై ఉగ్రవాదుల విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 40 మంది చనిపోయారు. 25 మంది గాయపడ్డారు. ఇందులో పలువురు మహిళలతో పాటు ఓ పోలీసు అధికారి కూడా ఉన్నారు.పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు బీభత్సం సృష్టించారు. లోయర్ కుర్రంలో ప్రయాణికుల వెళ్తున్న వాహనంపై ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 40 మంది చనిపోయారు. 25 మందికి పైగా గాయపడ్డారు. ఇందులో పలువురు మహిళలతో పాటు ఓ పోలీసు అధికారి కూడా ఉన్నారు. వాహనం పరాచినార్ నుంచి పెషావర్‌కు వెళ్తున్నట్లు సమాచారం. ఉచాట్ ప్రాంతంలో ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. క్షతగాత్రుల్లో 8 మంది మండోరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ దాడికి సంబంధించి పాక్ మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఓ ప్రకటన చేశారు. ఈ దాడి చాలా బాధాకరమని అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణ, ఆస్తి నష్టం జరగడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు పిరికిపంద చర్యకు పాల్పడ్డారు. ఈ దాడికి పాల్పడిన వారిని ప్రభుత్వం విడిచిపెట్టదని అన్నారు.దిగువ కుర్రం ఉగ్రదాడిపై ప్రత్యక్ష సాక్షులు కొందరు మాట్లాడుతూ ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారని.. విచక్షణారహితంగా కాల్పులు జరిపారని.. హృదయ విదారక సంఘటన గురించి చెప్పారు. హఠాత్తుగా దాడి చేయడంతో వాహనంలోని వ్యక్తులకు అసలు ఏమి జరుగుతుందో తెలుసుకునే అవకాశం కూడా లేకపోయింది.. ఏమీ అర్థం చేసుకోకముందే.. మృత్యు ఘోష అప్పటికే మొదలైంది.. మృతదేహాల కుప్పలుగా పడడం మొదలైందని చెప్పారు.వాహనంలో ఎక్కువ మంది షియా ముస్లింలు ఉన్నట్లు సమాచారం. ఈ దాడి జరిగిన కుర్రం జిల్లాలో ఇటీవలి కాలంలో మెజారిటీ సున్నీ, మైనారిటీ షియా ముస్లింల మధ్య అనేక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో పదుల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. ఖైబర్ పఖ్తుంఖ్వా రాజధాని పెషావర్‌కు అనేక వాహనాలు ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాయని ఓ పోలీసు అధికారి తెలిపారు. ఈ సమయంలోనే ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు.

## పంచాయతీ సర్పంచ్‌లకు గుడ్ న్యూస్ !

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీ సర్పంచ్ లకు గుడ్ న్యూస్ చెప్పనున్నారు. త్వరలోనే పంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ పంచాయతీలకు సంబంధించి 750 కోట్ల రూపాయల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయి పెట్టిన 1,200 కోట్లకు పైగా పంచాయతీ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. ఇటీవల కాలంలో బిల్లులు చెల్లించాలంటూ సర్పంచ్ లు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. పలు చోట్ల ధర్నాలు చేసిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. పంచాయతీలకు పెండింగ్ లో ఉన్న బిల్లులను దశల వారీగా క్లియర్ చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమయింది. నిధులతో జరిగిన పనులపై ఆరా తీసే పనిలో సరకార్ పడింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ లో ఉన్న బిల్లుల వివరాలను ఇవ్వాలని కోరింది. పంచాయతీల వారీగా పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? ఎప్పుడు పూర్తయ్యాయి? వంటి వివరాలను అందించాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లను కోరింది.

# ముదురుతున్న రామ్ చరణ్ దర్గా వివాదం..

హైదరాబాద్,అయ్యప్ప మాలధారణ వేసిన సినీ నటుడు రామ్ చరణ్ తేజ్ దర్గాను సందర్శించడం తీవ్ర దుమారం రేపుతోంది. మాలలో ఉండీ ఉర్సు ఉత్సవాల్లో ఎలా పాల్గొంటారని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదంపై హిందూ సంఘాలు తప్పుబడుతున్నాయి. చెర్రీ సతీమణి ఉపాసన దానిపై వివరణ ఇచ్చినా కూడా రామ్ చరణ్ క్షమాపణ చెప్పాల్సిందేనని అయ్యప్పస్వామి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మాల నియమాలకు విరుద్ధంగా వ్యవహరించిన రామ్ చరణ్ క్షమాపణ చెప్పాలని కోరుతున్నాయి.కడప నగరంలోని అమీన్‌పూర్ పెద్ద దర్గా ఉర్సు వేడుకల్లో రామ్ చరణ్ పాల్గొనడం.. అక్కడ ప్రార్థనలు చేయడం తీవ్ర దుమారానికి తెర రేపింది. అయ్యప్ప మాల వేసుకున్న స్వాములు రామ్ చరణ్ దర్గా సందర్శనను తప్పుబడుతున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విలేకరుల సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు గాంధీ కృష్ణ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. 'అయ్యప్ప మాలధారణలో ఉండి అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మెగా హీరో రామ్ చరణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. పవిత్రమైన అయ్యప్ప మాల ధరించి మాల నియమాలకు విరుద్ధంగా బొట్టును తొలగించడమే కాకుండా దర్గాను సందర్శించడం ధర్మానికి విరుద్ధమని స్పష్టం చేశారు. ధర్మాన్ని కాపాడతానంటూ ఓవైపు ఏపీ డిప్యూటీ సీఎం, రామ్ చరణ్ బాబాయి పవన్ కల్యాణ్ శ్రమిస్తుంటే అదే కుటుంబంలో జన్మించిన రామ్ చరణ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విచారకరమని పేర్కొన్నారు. రామ్‌చరణ్ బేషరత్‌గా అయ్యప్ప భక్తులకు, యావత్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉ



ద్ధృతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## లగచర్ల ఘటనలో పోలీసులు కోర్టు ధిక్కరణ

హైదరాబాద్, లగచర్ల ఘటనలో పోలీసులపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్త పట్నం నరేందర్ రెడ్డి అరెస్టు జరిగిందని పట్నం శృతి హైకోర్టులో పిటిషన్ ధాఖలు చేశారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక వ్యక్తిని అరెస్టు చేసే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలు పాటించలేదని పిటిషనర్ పేర్కొన్నారు. డీ.కే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషన్‌లో శృతి పేర్కొన్నారు. ప్రతివాదులుగా ఐజీ వి.సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కె. నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ పిటిషనర్ చేర్చారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com